ఏలూరు **ఉష్ణోగ్రతలు**

గరిష్ఠం : 34.0

కనిష్ఠం : 18.0

డీఎస్పీల బదిలీలు



పోలవరం డీఎస్పీ



నూజివీడు డీఎస్పీ

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 13 : రాష్ట్రంలో పనిచేస్తున్న డీఎస్పీలలో 30 మందిని బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పోలవరం డీఎస్పీగా ఇటీవల బదిలీ అయిన డీఎస్పీ జీవిఎస్ పైడేశ్వరరావును శ్రీ సిటీ సబ్ డివిజనల్ పోలీసు అధికారిగా బదిలీ చేశారు. ప్రకాశం జిల్లా దిశ పోలీస్ స్టేషన్ డీఎస్పీగా పనిచేస్తున్న తుపాకుల వెంకట రత్న స్వామిని ఎసీపీగా నియమిస్తూ ఆయనను ఏలూరు దిశ పోలీస్ స్టేషన్ డీఎస్పీగా అటాచ్డ్ పోస్టింగ్ ఇచ్చారు. పశ్చిమ గోదావరి జిల్లా సీసీఎస్ డీఎస్పీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన డీఎస్పీ యుగంధర్‌బాబును ఏసీబీ డీఎస్పీగా పోస్టింగ్ ఇచ్చి పశ్చిమ గోదావరి జిల్లా అటాచ్డ్ సీసీఎస్ డీఎస్పీగా పోస్టింగ్ ఇచ్చారు. నూజివీడు డీఎస్పీగా పోస్టింగ్ పొందిన ఎం.శ్రీనివాసరావును తిరిగి విశాఖపట్టణంలోని ఏసీబీ (సీఎస్పీ) విభాగానికి బదిలీచేశారు. ఎన్టీఆర్ పోలీస్ కమీషనరేట్‌లో ట్రాఫిక్-4 ఏసీపీగా పనిచేస్తున్న సురేష్ కుమార్ రెడ్డిని పోలవరం డీఎస్పీగా నియమించారు. విశాఖపట్టణం నార్త్ ఏసీబీగా ఉన్న సీహెచ్ మురళీకృష్ణను నూజివీడు డీఎస్పీగా నియమించారు.


ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 233 మంది గైర్హాజరు

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 13 : మంగళ వారం జరిగిన ఇంటర్మీడియట్ ఒకేషనల్, జనరల్ ప్రాక్టికల్స్ పరీక్షలకు జిల్లాలో మొత్తం 6,186 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 5,953మంది హాజరయ్యారని డీవీఈవో ప్రభాకరరావు ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయన్నారు.

పవన్ పర్యటన రద్దు



ముందుగానే భీమవరం చేరుకున్న పవన్ కల్యాణ్ భద్రతా సిబ్బంది వాహనాలు



- హెలీప్యాడ్‌కు అనుమతి ఇవ్వని ప్రభుత్వం
- చివరి నిమిషంలో వాయిదా వేసుకున్న జనసేనాని
- భీమవరంలో ఏర్పాట్లు.. అనుమతి ఇవ్వకపోవడంపై పార్టీ ఆగ్రహం.. కలెక్టర్‌ను కలిసినా ఫలితం లేదు

(భీమవరం/భీమవరం-ఆంధ్రజ్యోతి)

జనసేన అధినేత పవన్ కల్యాణ్ పర్యటన అర్ధంతరంగా రద్దయింది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో నాలుగు రోజుల పర్యటనలో భాగంగా బుధవారం ఉదయం హైదరాబాద్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో భీమవరం రావాల్సి వుంది. ఇక్కడి విష్ణు ఇంజనీరింగ్ కళాశాలలోని హెలిప్యాడ్‌లో దిగేందుకు ప్రభుత్వం అనుమతి నిరాకరించింది. దీంతో పర్యటన వాయిదా వేసుకున్నారు. జగన్ సర్కార్ తీరుపై జనసేన శ్రేణులు మండిపడుతున్నాయి. తెలుగుదేశంతో పొత్తు కుదిరిన తర్వాత తొలిసారి జిల్లా పర్యటన ఖరారు కావడంతో అన్నివర్గాల్లోనూ ఆసక్తి నెలకొంది. తెలుగుదేశం పార్టీకి చెందిన ఏడు నియోజకవర్గాల ఇన్‌ఛార్జ్‌లు పవన్‌ను మర్యాద పూర్వకంగా కలిసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. బుధవారం ఉదయం 11.30 గంటలకు కలిసేలా ప్రణాళిక చేసుకున్నారు. మరోవైపు జనసేన పార్టీకి చెందిన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు, ముఖ్య నాయకులతో పవన్ అంతరంగిక భేటీ ఉంది. పొత్తు ఆవశ్యకత, త్యాగాలు, ఇరు పార్టీల్లో సఖ్యత వంటి అంశాలపై ఆయన పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేసేలా ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆ దిశగా జిల్లా పార్టీ ఏర్పాట్లు చేసింది. ఆయన ఎప్పుడూ బస చేసే పెదఅమిరం కల్యాణ మండపంలో పెళ్లిళ్లు ఉండటంతో అది లభించ లేదు. దీనికి ప్రత్యామ్నాయంగా ఆనంద కన్వెన్షన్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ మేరకు సాయంత్రానికి పవన్ ముఖ్య భద్రతా సిబ్బంది భీమవరం చేరుకున్నారు. వాహనాలు వచ్చేశాయి. సుమారు 120 మంది వరకు పోలీసులు సిబ్బందితో ఏర్పాట్లు చేపట్టారు. ఉందనుకున్న తరుణంలో హెలికాప్టర్ రావడానికి భద్రతా చర్యలపై రోడ్లు భవనాల శాఖ అనుమతి ఇవ్వలేదు. రహదారి మీదుగా తీసుకొచ్చే ప్రయత్నాలకు అవకాశం లేకపోవడంతో పవన్ పర్యటన రద్దయ్యింది. విష్ణు ఎడ్యుకేషన్ సొసైటీ విద్యా సంస్థల్లో హెలిప్యాడ్‌లో గతంలో పలుమార్లు సీఎంలు వచ్చారు. ఆ ప్రాంతంలో సిద్ధంగా వున్న హెలిప్యాడ్‌పై హెలికాప్టర్ రావడానికి అనుకూల పరిస్థితులు ఉన్నాయని, అనుమతి ఇవ్వకపోవడంపై జనసేన పార్టీ నాయకులు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. దీనిపై జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు(చినబాబు) జిల్లా కలెక్టర్ ప్రశాంతిని కలిశారు. అయినా ఫలితం లేకపోయింది.

ఇది జగన్ కుట్ర : గోవిందరావు ధ్వజం



'సీఎం జగన్ హెలికాప్టర్లో మూడుసార్లు భీమవరం వచ్చారు. కాని, పవన్ రావడానికి మాత్రం భద్రతా కారణాలను సాకుగా చూపి పర్యటనను అడ్డుకుంటున్నారు. ప్రతిపక్ష పార్టీలను ఎలా ఎదుర్కోవాలో అధికార పార్టీకి అర్థం కావడం లేదు. అందుకే పవన్ టూర్‌ను ఏదోలా రద్దు చేసే విధంగా కుట్రకు పాల్పడ్డారు. ఇటువంటి కుట్రలు ఎంతో కాలం సాగవు. కొద్ది రోజులలోనే జగన్మోహన్ రెడ్డికి ప్రజలు బుద్ధి చెబుతారు. అధికార పార్టీ ఘోరంగా ఓడిపోనుంది. జనసేన-టీడీపీ ఉమ్మడి ప్రణాళికకు, అభివృద్ధికి ఓటు వేయాలని ప్రజలు నిర్ణయించారు' అని పార్టీ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు(చినబాబు) ధ్వజమెత్తారు.

ఏలూరులో పవన్ రోడ్‌షో

త్వరలో ఏలూరులో జరగబోయే పవన్ కల్యాణ్ రోడ్ షో, బహిరంగ సభలకు సంబంధించి రూట్ మ్యాప్, సభా స్థలాన్ని గోదావరి జిల్లాల ఎలక్షన్స్ ప్రోగ్రామ్స్ కన్వీనర్ బి.వి.రాఘవయ్యచౌదరితో కలిసి జనసేన జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు చర్చలు జరిపారు. జనసేన-తెలుగుదేశం ఉమ్మడి అభ్యర్థుల తరపున త్వరలో పవన్ ప్రచారం చేయనున్నారు. దీనిలో భాగంగా ఏలూరులో రోడ్‌షో ఉంటుంది. కైకలూరు రోడ్డు, గడియార స్తంభం, పాతబస్టాండ్ నుంచి ఫైర్‌స్టేషన్, అశోక్‌నగర్, పత్తేబాద, డీమార్ట్, పన్నెండు పంపుల సెంటర్‌కు చేరుకుని బహిరంగ సభ ఉంటుందని పేర్కొన్నారు. త్వరలో తేదీ ఖరారు చేస్తామన్నారు.

వలంటీర్





వారి విధులేంటి ? చేస్తున్నదేంటి ?

'ఈ వలంటీర్లు మరెవరో కాదు, మనల్ని, మన పార్టీని అభిమానించే మనలో నుంచి వచ్చిన మన వాళ్లేనని చెప్పడానికి గర్వపడుతున్నా'

- భీమిలిలో జరిగిన తొలి సిద్ధం బహిరంగ సభ వేదికగా జగన్ స్పష్టత

'ఏపీలో 30 వేల మహిళలు మాయమవడానికి ఈ వలంటీర్లే కారణం. ఇది నేను చెప్పింది కాదు, నేషనల్ క్రైం బ్యూరో(ఎన్‌ఏపీ) నిర్ధారించింది. ఇళ్లల్లో ఒంటరిగా ఉండే స్త్రీలను టార్గెట్ చేస్తోన్న వలంటీర్ల కారణంగానే ఈ అక్రమ రవాణా పెరిగిందని స్పష్టం చేసింది'

- ఏలూరులో జరిగిన వారాహి యాత్రలో జనసేన అధినేత చెప్పిన మాటలు.

- జనంపై ప్రయోగించిన ప్రైవేటు అస్త్రం
- ప్రతి ఇంటిపై అధికార పార్టీ నిఘా
- పెన్షన్లు, పథకాలతో మొదలై విస్తరించిన వ్యవస్థ
- పార్టీ వ్యక్తులకు వైసీపీ వందనం
- వీరి రాకతో ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులకు తగ్గిన ప్రాధాన్యం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

ఏ ఇంటిలోని వ్యక్తులు ఏం చేస్తున్నారు ? వారికి నెల జీతం ఎంత ? మీకు ఏయే ఆస్తులు ఉన్నాయ్ ? ఏ పార్టీకి సానుకూలంగా ఉన్నారు. ఒంటరిగా ఉంటోన్న మహిళలు ఎవరు? వారి మానసిక పరిస్థితి ఏంటి ? ఇలా ఒకటా రెండా ! ఒక కుటుంబం గురించి ఆ ఇంటి పెద్దకు తెలియాల్సిన వ్యవహారాలకు మించిన అంశాలు, ప్రజల వేలిముద్రలతో సహా ఇవాళ వలంటీర్ చేతికి వెళ్లిపోయాయి. జిల్లాలో జరిగే పలు క్రైం కేసుల్లో నిందితులుగా నమోదు అవడమేగాక, వైసీపీ నిర్వహించే ప్రతీ సభలు, కార్యక్రమాల్లో ఈ వలంటీర్లే కనిపిస్తున్నారు. ఆడ పిల్లలపై అఘాయిత్యాలకు తెగపడుతోన్న ఘటనలు మరిచేలోపే ఎన్నికలు, కులగణన సర్వేల్లోనూ వలంటీర్ల పెత్తనం సాగిపోతోంది. న్యాయస్థానాలు సైతం ఆంక్షలు విధిస్తున్నా లెక్కలేనితనాన్ని ప్రదర్శిస్తోన్న అధికారులు, అధికార పార్టీ రాజకీయ క్రీడలతో తాము సమిధలు కాక తప్పదేమోనన్న భయం పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లావాసుల్లో పెరుగుతోంది.

ఎందుకు వందనం ?

గుర్తింపు లేని ఒక వలంటీర్ వ్యవస్థకు రాష్ట్ర ప్రభుత్వం 'వందనం' అంటూ సాష్టాంగపడుతోంది. దేశంలో ఎక్కడా లేని విధంగా ఒక ప్రైవేట్ ఆర్మీని ప్రజలపై ప్రయోగించిన అధికార పార్టీ ఇలా ప్రభుత్వోద్యోగులకంటే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోంది. ప్రజల కోసం జిల్లాలో పని చేస్తోన్న వేలాది మంది ప్రభుత్వోద్యోగుల్ని పక్కన పెట్టేసిన ప్రభుత్వం వలంటీర్లను ప్రత్యేకంగా కాపాడు కుంటోంది. టీచర్లు, రెవెన్యూ, అంగన్వాడీ, ఆశా వర్కర్లు, మునిసిపల్ కార్మికులు వంటి ప్రజాక్షేత్రంలో విధులు నిర్వహిస్తోన్న ఉద్యోగులకు జీతాలు, అలవెన్సులు ఇవ్వకుండా వేధిస్తోంది. ప్రశ్నిస్తే అరెస్టులు చేయిస్తూ, భయపడని ఉద్యోగులను విధుల నుంచి తొలగించడానికి వారు వెనకాడటం లేదు. కానీ, ఎన్ని ఫిర్యాదులు, క్రైం కేసులు నమోదవుతున్నా వలంటీర్లపై ఈగ వాలనివ్వడం లేదు. ఇవన్నీ ఒకెత్తయితే సరిగ్గా ఎన్నికలకు రెండు నెలల ముందు వలంటీర్లకు వందనం అంటూ ప్రభుత్వం చేస్తోన్న కొత్త రాజకీయంపై ఉమ్మడి పశ్చిమ వాసుల్లో ఆందోళన నెలకొంది. ఈ వలంటీర్లను ఎన్నికల ముందు ఇంకా ఏయే కోణాల్లో ప్రజలకు వ్యతిరేకంగా ప్రయోగిస్తారోనని ప్రజలు భావిస్తున్నారు.

మనుగడ ప్రమాదం

2019కి ముందు వరకు పెన్షన్లు, రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ, ప్రభుత్వ సంబంధిత ఇతర ధ్రువపత్రాల జారీల్లో కార్పొరేషన్, మునిసిపల్, పంచాయతీ ఉద్యోగులతోపాటు రెవెన్యూ ఉద్యోగులే కీలకంగా పనిచేశారు. కానీ, ఇపుడు ఆ ఉద్యోగులను మినహాయించి వలంటీర్లకు విధులను పంచిపెట్టారు. రాను రాను ప్రజోపయోగ పనులకంటే ప్రభుత్వ, పార్టీ సంబంధిత పనులపైనే వలంటీర్లు ఎక్కువగా దృష్టిపెట్టారు. రెవెన్యూలో పనిచేస్తోన్న వీఆర్వో, వీఆర్ఏల మనుగడకు ఈ వలంటీరు వ్యవస్థ సున్నం పూసిందనే చెప్పాలి. నాలుగన్నరేళ్లుగా వలంటీర్ల కారణంగా వీఆర్వో, వీఆర్ఏలకు గుర్తింపు లేకపోయింది. గతంలో ఏదేని పనులపై ప్రజలు అధికారుల వద్దకు వెళితే లంచాలు అడుగుతున్నారనే అభియోగాలు వెలుగులోకి వచ్చేవి. ప్రస్తుత వలంటీర్ల వ్యవస్థలో ఆ లంచాలుస్థానే మితి మీరిన కోరికలు వెర్రి తలలు వేస్తున్నాయి. మహిళలను వేధించడం, పార్టీల వారీగా వ్యక్తులను టార్గెట్ చేయడం, రేషన్ కార్డు, పింఛన్లు ఇప్పిస్తామని వసూళ్లకు దిగడంతో పాటు ఉదయం లేచింది మొదలు సాయంత్రం వరకు ఆ వలంటీర్లు నిర్దేశించిన ఇళ్ల చుట్టూనే తిరుగుతుండటం ప్రజలకు తలనొప్పిగా తయారైంది. దీంతో చాలాచోట్ల ప్రజలకు, వలంటీర్లకు మధ్య వివాదాలు రేగుతున్నాయి. ఏలూరు, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, పోలవరం తదితర ప్రాంతాల్లో ఇబ్బడి ముబ్బడిగా కేసులు నమోదయ్యాయి. అయినా నేటికీ ఆ వ్యవస్థపై ప్రభుత్వ నియంత్రణ లేకపోవడం గమనార్హం. సమస్య సృష్టించిన వలంటీర్‌ను విధుల నుంచి తప్పించడమే తప్ప మరో వలంటీర్ ఏవిధమైన సమస్యలకు పాల్పడకుండా చూసే వ్యవస్థ ఈ ప్రభుత్వంలో లేకపోవడమే అందుకు తార్కాణం.

అప్పుడలా.. ఇప్పుడిలా

పెన్షన్లను ఇళ్ల వద్దకే వెళ్లి అందజేయడం, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడమే ధ్యేయంగా అడుగు పెట్టిన వలంటీర్ల వ్యవస్థ నేడు ప్రజలపై పెత్తనం చేసే స్థాయికి చేరింది. 2019 అక్టోబరులో అడుగుపెట్టిన వలంటీర్లు క్రమ క్రమంగా జిల్లాలోని ప్రతీ 50-70 ఇళ్లను పూర్తిగా స్వాధీనం చేసుకున్నారు. శుభాశుభ కార్యక్రమాలు మొదలు ఏ వ్యక్తి మానసిక స్థితి ఎలా ఉంటుందనే సమాచారం వరకు వలంటీర్లు సేకరించారు. చివరకు వ్యక్తుల వేలిముద్రలు ఆ వ్యవస్థ చేతిలోనే ఉన్నాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 1,165 సచివాలయాల్లో 18,430 వార్డు, గ్రామ వలంటీర్లు జగన్ సర్కార్‌కు పర్సనల్ ఆర్మీగా ఉపయోగపడుతున్నారు. ప్రతీ సమాచారాన్ని అధికార పార్టీకి చేరవేయడంలో పరోక్ష ప్రత్యక్ష ప్రమేయం వీరిదే. ఇంతచేస్తున్నా రూ.5 వేలకు మించి జీతాలు ఇవ్వకపోవడంపై కొన్నాళ్లుగా వలంటీర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తుండటం గమనార్హం. ఎన్నికల విధులు మొదలు కులగణన సర్వేల వరకు వలంటీర్ల ప్రమేయాన్ని వ్యతిరేకిస్తూ ఇతర రాజకీయ పార్టీ నాయకులు న్యాయ స్థానాలను ఆశ్రయించారు. వలంటీర్లను వెంటేసుకు తిరుగుతున్న ఎన్నికల అధికారులపై జిల్లా అధికారులు ప్రతాపం చూపించారే తప్ప ఒక్క వలంటీర్‌ను టచ్ చేయలేక పోయారు. పరిస్థితులు చూస్తే రాబోయే ఎన్నికల్లో డబ్బుల పంపిణీకి వీరినే ఉపయోగించుకోవాలని అధికార పార్టీ యోచిస్తున్నట్లు స్పష్టమవుతోంది. వలంటీర్లే కాబట్టి ఎలాంటి నిబంధనలు, అనుమానాలు లేకుండా పెన్షన్లు ఇస్తున్నామనో, వివరాలు అడుగుతున్నామనే సాకులతో డబ్బుల పంపిణీ నిర్వహించే ప్రమాదం ఉందని పలు పార్టీ, ప్రజా సంఘాల నాయకులు గగ్గోలు పెడుతున్నారు. అధికారులు స్పందించాలి.



జీబ్రా లైన్ దాటకుండానే విధిస్తున్న ఫైన్‌లు

ఆటో, ట్యాక్సీలపై ఈ చలానాల మోత

ఒక్కొక్క ఆటోపై రూ.300 నుంచి రూ.20 వేల వరకు విధింపు

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 13 : ఆటోలు, ట్యాక్సీలపై ఈ చలానాల మోత మోగుతోంది. దీనిపై డ్రైవర్లు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. ఏలూరు నగరంలో సాఫ్‌లైన్ వైలేషన్ పేరుతో ఆటోలు, ట్యాక్సీలు, ఇతర వాహనాలపై తప్పు లేకున్నా ఈ చలానాలు విధిస్తున్నారు. దీనిపై ఆలిండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ దశల వారీ ఆందోళనకు సిద్ధమైంది. నగరంలో పాత బస్టాండు వద్ద సిగ్నల్ పాయింట్, స్టాప్‌లైన్, సీసీ కెమెరాలు సరైన క్రమపద్ధతిలో లేకపోవడంతో జీబ్రాలైన్ దాటక ముందే ఈ చలానా విధించడంతో ట్యాక్సీ, ఆటో డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారు. అసలే కిరాయిలు లేక సతమతమవుతున్న ఆటో, ట్యాక్సీ డ్రైవర్లపై రూ.300 నుంచి రూ.20 వేల వరకు ఈ చలానా విధించడంతో తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ట్యాక్సీ డ్రైవర్లకు వాహన మిత్ర పేరుతో రూ.10 వేలు ఇస్తోంది. చలానాలు, డీజిల్ ధరల్లో లక్షకుపైగా గుంజుకుంటుందని విమర్శిస్తున్నారు. జీవో నెంబర్ 21 రద్దు చేయాలని, పెంచిన రోడ్డు ట్యాక్స్, గ్రీన్ ట్యాక్స్‌లను తగ్గించాలని డిమాండ్ చేస్తున్నారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ రెన్యువల్ చేసుకోవాలన్నా, ఈ చలానాలు చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎటు చూసినా రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా తయారైంది. టోల్‌గేట్ల ఛార్జీలు విపరీతంగా పెంచేశారు. పెట్రోల్, డీజిల్ ధరలు పొరుగు రాష్ట్రాలకంటే అధికంగా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి తక్షణమే ఆటోలు, ట్యాక్సీలపై విధించిన ఈ చలానాలు బేషరతుగా రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

పాత బస్టాండు వద్ద ఇదీ పరిస్థితి

ఏలూరు పాతబస్టాండు సిగ్నల్ పాయింట్ కోమలా విలాస్ రోడ్డులో జీబ్రా లైన్‌కు, సాఫ్‌లైన్‌కు దాదాపు 10 నుంచి 15 మీటర్ల దూరం ఉంది. వాహనదారులకు జీబ్రా లైన్ దగ్గరే సాఫ్‌లైన్ ఉంటుందని ఆటో, ట్యాక్సీ డ్రైవర్లు అవగాహనతోనే ఉంటున్నారు. కాని పై ఫొటోలో రెడ్ కలర్ రౌండ్ చేసిన దగ్గర సాఫ్‌లైన్ ఉంది. బ్లూకలర్ రౌండ్ చేసిన దగ్గర జీబ్రాలైన్ ఉంది. ఇది గమనించని డ్రైవర్లు ఈ చలానాలకు బలైపోతున్నారు. దీనిపై జిల్లా కలెక్టర్, ట్రాఫిక్ పోలీసులకు తెలియచేసినా ఇప్పటికి పరిష్కారం దిశగా చర్యలు జరగలేదు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చలానాలు ఆర్థిక భారం : జె.గోపి, రవి, ఎస్.శివ







- ఆటోడ్రైవర్లపై ఈ చలానాలు ఆర్థిక భారం అవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఆటోడ్రైవర్లపై వున్న పాత, ఈ చలానాలు రద్దు చేయాలి. వాహనమిత్ర పేరుతో రూ.10 వేలు ఇచ్చి పోలీసులు ఈ చలానాలు, రవాణా శాఖ అధికారులు అక్రమ కేసులు పెట్టి ఏడాదికి ఒక్కో ఆటో డ్రైవర్ నుంచి రూ.50 వేలు గుంజుతున్నారు. ఈ చలానాలు రద్దుచేయాలి.
- ఆటో రంగానికి పీఎఫ్, ఈఎస్ఐ పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డును ఏర్పాటుచేయాలి. ప్రమాదకరంగా ఉన్న రహదారులు బాగు చేయాలి. మోటారు వాహనాలపై పెంచిన ట్యాక్స్‌లు రద్దు చేయాలి. లేకుంటే ఆందోళన చేస్తాం.
- పెంచిన రోడ్డు ట్యాక్స్ గ్రీన్స్ ట్యాక్స్‌లు తగ్గించాలి. రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. టోల్‌గేట్ ఛార్జీలు తగ్గించాలి. ఆటోలు, ట్యాక్సీలపై విధించిన ఈ-చలానాలు బేషరుతుగా రద్దు చేయాలి.

జంగారెడ్డిగూడెం నేరమయం



చనిపోయిన ఫొటో గ్రాఫర్ అనిల్ (ఫైల్)

జంగారెడ్డిగూడెం టౌన్, ఫిబ్రవరి 13 : శరవేగంగా అభివృద్ధి చెందుతున్న జంగారెడ్డిగూడెంలో నేర ప్రవృత్తి అంతేవేగంగా పెరగడం ఆందోళన కలిగిస్తోంది. అల్లర్లు, వర్గ విభేదాలు, కబ్జాలు సర్వసాధారణంగా మారాయి. చిన్న చిన్న తగాదాలకు ఆయుధాలతో దాడులకు తెగబడుతున్నారు. ఇద్దరి మధ్య వాగ్వాదాన్ని వర్గ విభేదంగా సృష్టిస్తూ దాడులకు దిగుతున్నారు. మద్యం, గంజాయి మత్తులో ఎంతకైనా తెగిస్తున్నారు. సుపారీలు తీసుకొని అల్లర్లు సృష్టించే గ్యాంగులకు పట్టణం అడ్డాగా మారింది. వీటిని అదుపు చేయడం పోలీసులకు పెద్ద టాస్క్‌గా మారింది. లక్షకు పైగా జనాభా వున్న జంగారెడ్డిగూడెంలో గడిచిన పదేళ్లలో వ్యాపారపరంగా అభివృద్ధి చెందింది. భూముల ధరలు, కార్పొరేట్ వ్యాపారాలు పెరిగాయి. ఈ తరుణంలో సెటిల్‌మెంట్ బ్యాచ్‌ల అడ్డాలు వెలిశాయి. మాట వినక పోతే బెదిరింపులు, దాడులతోపాటు కొన్నిసార్లు తాగిన మైకంలో ఎంతకైనా తెగిస్తున్నారు. ఏడాది కాలంగా యువకుల అల్లర్లు, వర్గాల మధ్య గొడవలు, కత్తులతో దాడులు పదికిపైగా జరిగాయి. ఇదే పరిస్థితి కొనసాగితే యువకుల భవిష్యత్ అంధకారమయ్యే ప్రమాదం ఉంది.



'గంజా' రెడ్డిగూడెం

- పెరుగుతున్న నేరాలకు ప్రధాన కారణం గంజాయి, మద్యం మత్తేనని పట్టణ ప్రజలు వాపోతున్నారు. మూకదాడులు, వర్గ విభేదాల్లో అధిక శాతం మంది యువత ఉండడం శోచనీయం. యువత బహిరంగంగా గంజాయి సేవిస్తున్నా, విక్రయిస్తున్నా అడిగే నాథుడు లేడని పలువురు యువకుల తల్లిదండ్రులు విలపిస్తున్నారు. అడపాదడపా దాడులు తప్ప గంజాయి నిర్మూలనకు పోలీసులు చేపట్టిన శాశ్వత పరిష్కారం లేదని పలువురు బాధితులు వాపోతున్నారు. నేటికి టన్నుల కొద్ది గంజాయి జిల్లాలు దాటి రవాణా జరగడం, లేదా పట్టుబడటమే ఇందుకు నిదర్శనం.

• రాజస్థాన్ దాబా ధ్వంసం

గత డిసెంబరులో మద్యం మత్తులో సబ్ స్టేషన్ వద్ద ఉన్న రాజస్థాన్ దాబాలో యువకులు విధ్వంసం సృష్టించారు. ఆర్డర్ లేట్‌గా ఇచ్చారని దాబా ధ్వంసం చేశారు. కూలర్లు, అద్దాలు పగులగొట్టారు. బిల్లు ఇవ్వకుండా వెళ్లేందుకు కొందరు ఇలా చేస్తున్నారని, ఇలాంటి ఘటనలు దాబాలో తరచూ జరుగుతున్నాయని నిర్వాహకులు గగ్గోలు పెడుతున్నారు.



• పోలీసులపై తిరుగుబాటు

శ్రీనివాసపురం జంక్షన్‌లోని ఓ దాబాలో నిత్యం మద్యం సేవించడం, గొడవలు జరగడం సర్వసాధారణమే. ఆరు మాసాల క్రితం దాబాలో మద్యం సేవిస్తున్న రెండు వర్గాల మధ్య ఘర్షణ తారస్థాయికి చేరింది. పోలీ సులు రంగంలో వచ్చినా యువకులు పట్టించుకోకపోవడమే కాక, చివరకు పోలీసులతో గొడవకు దిగారు.

• గంజాయి మత్తులో యాక్సిడెంట్

ఇద్దరు యువకులు గంజాయి మత్తులో చేసిన యాక్సిడెంట్‌కు ఫొటోగ్రాఫర్ కుటుంబం రోడ్డున పడింది. గంజాయి మత్తులో యువకులు ద్విచక్ర వాహనంపై వస్తున్న మహశివబట్టు అనిల్‌కుమార్‌ను ఢీకొనడంతో తలకు తీవ్ర గాయమైంది. విజయవాడ ప్రైవేట్ ఆసుపత్రిలో వారం రోజుల చికిత్స తర్వాత అనిల్ మృతి చెందాడు. 8 నెలల పాపతో ఫొటోగ్రాఫర్ అనిల్ కుటుంబం రోడ్డున పడింది.

• కిరోసిన్ పోసుకుని హల్‌చల్

గత నవంబరులో బస్టాండ్ వద్ద ఓ కారు, మోటార్ సైకిల్ ఢీకొన్న ఘటనలో ఇద్దరి మధ్య గొడవ మొదలైంది. అది కాస్త ఇరు వర్గాల మధ్యకు చేరింది. దీంతో ఓ వ్యక్తి బస్టాండ్ పక్కగల పెట్రోల్ బంక్‌లోకి వెళ్లి క్యాన్‌లో వున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకొని గందరగోళం సృష్టించాడు. దీంతో ఆప్రాంత వాసులు భయభ్రాంతులకు గురయ్యారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

• క్రికెట్ బెట్టింగ్.. కొట్లాట

బస్టాండ్ ఎదురుగా గల ఓ సందులో 50 మంది యువకులు వాగ్వాదాకియయ దిగిన ఘటన గత మే నెలలో జరిగింది. క్రికెట్ బెట్టింగ్ నగదు విషయంలో మొదలైన వాగ్వాదం కాస్త కోడెక్కి కొట్టికునే స్థితికి చేరుకుంది. కొట్లాటలో దుకాణాల ముందు పార్క్ చేసిన వాహనాలు, పూలకుండీలు ధ్వంసం అయ్యాయి. ఇలా ఒకటా, రెండా.. నిత్యం పట్టణంలో ఏదో మూల గొడవలు జరుగుతూనే ఉన్నాయి. మద్యం, గంజాయి మత్తులో ఈ నేరాలు జరుగుతున్నాయని అర్థమవుతోంది. పోలీసులు సైతం మరింత కఠినంగా వ్యవహరించి నేరాలను అదుపు చేయాలని ప్రజలు కోరుతున్నారు.





• కత్తితో దాడి, అనిల్ మృతి

ఇటీవల ఇద్దరి యువకుల మధ్య పాత గొడవల నేపథ్యంలో జరిగిన దాడి కొత్తూరి అనిల్(29) మృతికి కారణమైంది. మప్పిడి గంగారాంకు అనిల్‌కు కోడి పందేల వద్ద ఘర్షణ జరిగింది. ఇది పెరిగి గంగారం కత్తి(బటన్ కత్తి)తో అనిల్‌ను గాయపర్చినట్లు స్థానికులు చెబుతున్నారు. పేగులు బయటకు వచ్చి విలవిలలాడుతూ అనిల్ ఏలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 12న మృతి చెందాడు.

• కోడి కత్తితో దాడి, ఏడుకొండలు మృతి

గత సెప్టెంబరులో పట్టణానికి చెందిన గోసుల ఏడుకొండలు అలియాస్ బాలాజీ (22) అను వ్యక్తిని మరొక వ్యక్తి పాత గొడవల నేపథ్యంలో కత్తితో విచక్షణారహితంగా దాడికి పాల్పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

• బీరు బాటిల్‌తో దాడి..

ఇటీవల భోగి పండుగ రోజున యువకుల మధ్య జరిగిన గొడవ పెద్ద ట్రాఫిక్‌జామ్‌కు కారణమైంది. మీ సేవ సెంటర్ వద్ద బీరు బాటిల్‌తో యువకుడిపై దాడి చేసిన నేపథ్యంలో కొద్దిసేపటికి 300 మంది యువకులు రోడ్డుపైకి చేరి కొట్లాటకు దిగారు. గంటకుపైగా జరిగిన గొడవ పోలీసుల చొరవతో సర్దుమణిగింది.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక


జిల్లాస్థాయి చెస్ పోటీల విజేతలతో నిర్వాహకులు

భీమవరం అర్బన్, ఫిబ్రవరి 13: పశ్చిమగోదావరి జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనసూయ చెస్ అకాడమీలో మంగళవారం జిల్లాస్థాయి అండర్-7, 9 బాలబాలికల చదరంగం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు జిల్ల నలుమూలల నుంచి 30మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీలో విజేతలు రాష్ట్రస్థాయి అండర్ 7, 9 బాలబాలికల చదరంగ పోటీలో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాదాసు కిషోర్ తెలిపారు. అండర్-7 బాలుర విభాగంలో మొదటి బహుమతి ఆశ్రిత, రెండో బహుమతి సీహెచ్ సాయిశ్రీలు, బాలికల విభాగంలో మొదటిస్థానంలో పి.అని, రెండో స్థానంలో డి.నిత్వికా సుబ్రహ్మణ్యం నిలిచారు. అండర్-9 బాలుర విభాగంలో మొదటిస్థానంలో దేహన్షి, రెండో స్థానంలో బి.దక్షిత్, బాలికల మొదటి స్థానంలో కె.హేశ్రీత, రెండో స్థానంలో ఎస్‌కే మనీషా నిలిచారన్నారన్నారు. విజేతలకు పట్టణ ప్రముఖ డాక్టర్ సుజ, డాక్టర్ ఎ.నరసింహరాజు, జీఎస్‌టీ ఇన్‌స్పెక్టర్ చారి చేతుల మీదుగా బహుమతులు అందించారు.

చింతపర్రు పాఠశాల ఉపాధ్యాయుడి సస్పెన్షన్

భీమవరం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 13:విద్యార్థులను అసభ్య పదజాలంతో దూషించుట, మానసిక సంఘర్షణకు గురిచేసే విధంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేశామని ఏలూరు జిల్లా డీఈవో ఆర్.వెంకటరమణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాలకొల్లు మండలం చింతపర్రు జడ్పీ ఉన్నత పాఠశాల ఉపా ధ్యాయుడు కె.మధుసూదనరావు స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్) సదరు పాఠశాల విద్యార్థులను దూషించడంతో సస్పెండ్ చేశామని చేశామన్నారు.

సమరానికి సిద్ధం

'నాలుగున్నరేళ్ల పాలనలో వైసీపీ ప్రభుత్వం ఉద్యోగులకు చేసిందేమీ లేదు. తొలుత మధ్యంతర భృతిని 27శాతం ఇచ్చి ఫిట్‌మెంట్‌కు వచ్చేసరికి దానిని 23 శాతానికి తగ్గించడం చరిత్రలో ఎక్కడాలేదు. ఇక సీపీఎస్ రద్దు విషయంలోనూ మాట తప్పారు. ఉద్యోగుల కనీస డిమాండ్ల పరిష్కారానికి కొవిడ్ తదితర సాకులను చెబుతూ కాలయాపన చేస్తున్న ప్రభుత్వానికి ఇప్పటికే ఎన్నో అవకాశాలిచ్చాం. చివరకు మేం దాచుకున్న డబ్బులనుకూడా ఇవ్వాల్సిందిగా ఏళ్ల తరబడి అడుగుతున్నా జాప్యం చేస్తున్నందునే ఉద్యమ శంఖారావానికి సిద్ధమయ్యాం. మాకు ఇవ్వాల్సిన ఆర్థిక బకాయిల చెల్లింపుపై ఇక ముఖ్యమంత్రితోనే చర్చలుగానీ, పరిష్కారాలుగానీ ఉంటాయి. మంత్రుల కమిటీల మాటలగారడీలకు తలొగ్గం' అంటూ పోరుబాటకు సిద్ధమయ్యారు.


విలేకరులతో మాట్లాడుతున్న ఏపీఎన్జీవో నేత శ్రీనివాస్, తదితరులు

దగా ప్రభుత్వంపై ఉద్యోగుల పోరుబాట

నేటినుంచి దశలవారీ ఉద్యమ కార్యాచరణ

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 13 : ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం బకాయిపడిన రూ.23,250 కోట్లను చెల్లించాలంటూ ఏపీ జేఏసీ బుధవారం నుంచి నిర్వహించ తలపెట్టిన దశలవారీ ఉద్యమ కార్యాచరణను మంగళవారం ఏలూరులో ఐక్య కార్యాచరణ సమితి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఛైర్మన్ సీహెచ్.శ్రీనివాస్, కన్వీనర్ ఎన్.వి.రామారావు తదితరులు విలేకరుల సమావేశంలో ప్రకటించారు. ఆర్థిక బకాయిలపై మంత్రులు, ఆర్థికశాఖ ఉన్నతాధికారుల సమక్షంలో జేఏసీ నాయకులతో జరిగిన చర్చల్లో ఎటువంటి ఫలితంలేనందున తొలుత ప్రకటించినట్టుగానే బుధవారం నుంచి ఉద్యమాన్ని యథాతథంగా నిర్వహిస్తున్నామన్నారు. 12వ పీఆర్సీ అమలుకు ముందుగా మధ్యంతర భృతి ఇవ్వాలని అభ్యర్థించినప్పటికీ మంత్రుల కమిటీ సానుకూలంగా స్పందించలేదని వివరించారు. మొత్తం బకాయిల్లో రూ.5,500 కోట్లను వచ్చేనెలలోగా సర్దుబాటు చేయడానికి ప్రభుత్వం ముందుకువచ్చిందని, ఈ చెల్లింపునకు రూట్‌మ్యాప్ ఇవ్వాలని జేఏసీ ప్రతిపాదించగా నిరాకరించడమే ప్రభుత్వ హామీపై అపనమ్మకానికి నిదర్శనమన్నారు. ఇంటీరియం రిలీఫ్‌పై మంత్రుల కమిటీ దాటవేత వైఖరిని జేఏసీ సభ్యసంఘాలు ఆక్షేపిస్తున్నా యన్నారు. కొవిడ్‌తో మృతిచెందిన ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకాలు ఇంతవరకు కార్యరూపం దాల్చలేదని చర్చల్లో ప్రశ్నించినా ప్రభుత్వంనుంచి స్పందనలేదన్నారు. వీటితోపాటు సరెండర్ లీవులు, జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ రుణాలు, డీఏ బకాయిలు, 11వ పీఆర్సీ బకాయిలు, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, మెడికల్ బిల్లుల చెల్లింపులువంటి డిమాండ్లను ప్రభుత్వం ముందుంచామని, వీటిలో ఏ ఒక్కటీ పూర్తిస్థాయిలో పరిష్కారమవుతాయన్న నమ్మకం కలగకపోవడంవల్లే ఉద్యమ కార్యాచరణను చేపట్టాలని తీర్మానించారని వివరించారు. ఇక మీదట మంత్రుల కమిటీలతో చర్చలు జరిపే ప్రసక్తేలేదని, నేరుగా ముఖ్యమంత్రే జోక్యం చేసుకుని ఆయన సమక్షంలో మాత్రమే చర్చలు జరిపితే జేఏసీ నాయకులు వెళతారని స్పష్టం చేశారు.

నేటినుంచి ఉద్యమ తీరు ఇలా..

డిమాండ్ల సాధన కోసం చేపట్టిన ఉద్యమ శంఖారావంలో భాగంగా బుధవారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ నల్లబ్యాడ్జీలను ధరించి విధులకు హాజరవుతారని తహసీల్దార్/ సబ్‌కలెక్టర్/ కలెక్టర్‌లకు వినతిపత్రాలు అందజేస్తారని వివరించారు. 15, 16 తేదీల్లో మధ్యాహ్న భోజన విరామ సమయంలో తాలూకా/పాఠశాలల్లో నిరసనలు, 17న తాలూకా కేంద్రాల్లో ర్యాలీ-ధర్నా, 20న జిల్లా కలెక్టరేట్లవద్ద ర్యాలీ, ధర్నా, 21 నుంచి 24 వరకు జిల్లావ్యాప్తంగా జేఏసీ నాయకుల పర్యటన, 27న చలో విజయవాడ ఆందోళనలను చేపట్టడానికి తీర్మానించి నట్టు ఏపీ ఎన్జీవో నాయకుడు శ్రీనివాస్ వివరించారు.

మిగతా డిమాండ్లు ఇవే..

2004 సెప్టెంబరు ఒకటో తేదీకి ముందు నోటిఫై అయిన అనంతరం నియామకాలు జరిగిన ఉపాధ్యాయులు, ఉద్యోగులకు పాతపెన్షన్ స్కీం (ఓపీఎస్)ను అమలు చేయాల్సిందేనని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. పెన్షనర్లలో 70-75ఏళ్ళ వయస్సున్న వారికి అడిషినల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ మంజూరు చేయాలని, అన్ని నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఈహెచ్‌ఎస్ కార్డులపై నగదు రహిత వైద్యం, ఉద్యోగులందరికీ ఇంటి స్థలాలు, టీచర్లకు అప్రెంటీస్ విధానాన్ని రద్దుచేయాలి. ప్రభుత్వ, పంచాయతీరాజ్ టీచర్లకు ఉమ్మడి సర్వీసు రూల్స్ అమలు, ప్రతీ నెలా ఒకటో తేదీనే జీతభత్యాలు చెల్లించాలని, ఉద్యోగ విరమణ చేసిన వారికి బెనిఫిట్స్‌ను అందించాలి. సమావేశంలో జేఏసీ ఉమ్మడి జిల్లా నా యకులు రవికుమార్, నరసింహారావు, ఆంజనేయులు, సత్యనారాయణ, శ్రీధర్ రాజు, గంగాధర్, బేగ్, మల్లిక, సునీత, రమణ, స్వామి, సత్యభారతి, శ్రీనివాస్, హరినారాయణ, సీఐటీయూ కార్యదర్శి ప్రసాద్, సీపీఐ నాయకులు వెంకటేశ్వర రావు, అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు పాల్గొన్నారు.

స్పందించకపోతే ఎలా ?

సమస్యలు ఏకరవు పెట్టిన జడ్పీటీసీ సభ్యులు

వాడివేడిగా జడ్పీ సర్వ సభ్య సమావేశం


జడ్పీ సమావేశంలో పాల్గొన్న జడ్పీటీసీలు, ఎంపీపీలు, అధికారులు, మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

ఏలూరుసిటీ, ఫిబ్రవరి 13: ఏలూరు జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన జరిగిన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో చివరి సమావేశం కావడంతో జడ్పీటీసీలు పలు సమస్యలను లేవనెత్తారు. రహదారులు అధ్వానంగా ఉన్నాయని, సమస్యలపై ప్రస్తావిస్తున్నా అధికారులు స్పందించకపోతే ఎలా అని జడ్పీటీసీలు వాపోయారు. జిల్లాలో ఉన్న ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలలో ఒకే ఒక్క ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు మాత్రమే సమావేశానికి హాజరుకావడం గమనార్హం. పలు మండలాలకు చెందిన జడ్పీటీసీలు సమావేశంలో తాము పడుతున్న ఇబ్బందులను వివరించారు. సమస్యలు విన్నవించినా అధికారుల నుంచి సరైన సమాధానం రావడం లేదన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో అంతర్భాగమైన పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లాల నుంచి ఉన్నతాధికారులు సమావేశాలకు హాజరుకాకపోతే సమస్యలను ఎవరికి విన్నవించాలని పలువురు జడ్పీటీసీలు వాపోయారు. సమావేశానికి ఏలూరు జిల్లా కలెక్టర్ వై.ప్రసన్నవెంకటేశ్ మాత్రమే హాజరయ్యారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండడంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు పూర్తికాకపోవడంతో ప్రజలకు ఏం సమాధానం చెప్పాలని పలువురు జడ్పీటీసీలు పేర్కొన్నారు. పోలవరం ముంపు గ్రామాల్లో సమస్యలను ఆయా జడ్పీటీసీలు వివరించారు. జడ్పీటీసీలకు అధికారుల నుంచి తగిన గౌరవం లభించడం లేదని, ఎన్నోసార్లు సమావేశాల్లో పేర్కొన్నా ఈ సమస్య పరిష్కారం కావడం లేదని పలువురు జడ్పీటీసీలు వాపోయారు.

ప్రజాప్రతినిధులను భాగస్వాములు చేయాలి: జడ్పీ చైర్‌పర్సన్

ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులను భాగస్వాములు చేయాలని జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధికారులకు సూచించారు. మండల పరిధిలో జరిగే కార్యక్రమాల్లో స్థానిక ఎంపీపీ, జడ్పీటీసీ, సర్పంచ్‌వంటి స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం అందించాలన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులకు సమాచారలోపం జరిగినట్టు ఫిర్యాదులు వస్తే సదరు అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పంచాయతీరాజ్, ఉపాధి హామీ పథకం, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర శాఖల ద్వారా మంజూరైన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, సంబంధిత బిల్లులను వెంటనే అప్లోడ్ చేయాలన్నారు. సభ్యులు తెలిపిన సమస్యలపై స్పందిస్తూ వేలేరుపాడు మండలంలోని రేపాకగొమ్ము, తోటకూరగొమ్ము , దాచారం, కొయిదా తదితర గ్రామాల్లో తాగునీటి సమస్యకు మంచినీటి బోర్లు ఏర్పాటు చేయాలన్నారు. పలు ప్రాంతాల్లో రోడ్లకు మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు.

● జిల్లా కలెక్టర్ వై.ప్రసన్నవెంకటేశ్ మాట్లాడుతూ జిల్లాలో పలు అభివృద్ధి పథకాలకు సంబంధించి పూర్తి చేసిన పనుల బిల్లులను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. పేదల ఇళ్ల పథకానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనలు మంజూరైన వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. జిల్లాలో జగనన్న భూహక్కు, భూసర్వే కార్యక్రమం కింద అధునాతన పద్ధతిలో డ్రోన్ల ద్వారా రీ సర్వే కార్యక్రమాన్ని చేపట్టామని, సదరు జాబితాలను సంబంధిత గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రదర్శించామన్నారు. సర్వే అనంతరం సదరు భూ యజమానులు నుంచి సక్రమంగా ఉన్నాయని అంగీకారం తీసుకుంటారని, యజమానులు అభ్యంతరం వెల్లడిస్తే సదరు సమస్య పరిష్కరించిన తరువాత మాత్రమే భూహక్కు సర్వే పత్రం ముద్రించి రైతుకు అందిస్తున్నామని జడ్పీటీసీ సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా కలెక్టర్ చెప్పారు.

● జాతీయ రహదారిలో కలపర్రు నుంచి గుండుగొలను మధ్య రహదారులు గుంతల కారణంగా వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయని, ఆ ప్రాంతంలో రహదారి మరమ్మతు పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ జిల్లా కలెక్టర్‌ను కోరారు.

● ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల శ్రీనివాసరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో నాడు-నేడు కార్యక్రమం కింద నిర్మిస్తున్న పాఠశాలల అదనపు తరగతి గదులు, అంగన్‌వాడీ భవనాలు ఇతర నిర్మాణ పనులలో 90 శాతం పూర్తయ్యాయయని, డోర్లు, కిటికీలు, ఫర్నిచర్ వంటి కొన్ని సౌకర్యాలు కల్పిస్తే వెంటనే వినియోగంలోకి తీసుకురావచ్చన్నారు. సమావేశంలో పశ్చిమ గోదావరి జిల్లా రెవెన్యూ అధికారి బీఎస్ నారాయణరెడ్డి, జడ్పీ సీఈవో కేఎస్ఎస్ సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, గృహనిర్మాణ శాఖ పీడీ కేవీఎస్ఆర్ రవికుమార్, పలు శాఖల ఉన్నతాధికారులు, జడ్పీటీసీలు, ప్రజాప్రతినిదులు పాల్గొన్నారు.

ఇతరులకు చేపల వేట అవకాశం ఇవ్వొద్దు

అటవీశాఖ క్షేత్రాధికారికి ముంపు గ్రామాల మత్స్యకారుల ఫిర్యాదు


అటవీశాఖ క్షేత్రాధికారికి వినతిపత్రం అందిస్తున్న మత్స్యకారులు

పోలవరం, ఫిబ్రవరి 13 : పాపికొండల అభయారణ్యం పరిధి గోదావరిలో ఇతర ప్రాంతాల మత్స్యకారులు చేపల వేట కొనసాగిస్తూ స్థానిక మత్స్యకా రుల ఉపాధి పోగొడుతున్నారని మంగళవారం పోలవరం అటవీశాఖ క్షేత్రాధికారి ఎస్.దావీదురాజుకు ముంపు గ్రామాల మత్స్యకారులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మత్స్యకారులు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణానంతరం ప్రాజెక్టు దిగువన నదిలో చేపల సంతతి తగ్గడం వల్ల తాము ఉపాధి కోల్పోయామని, ప్రాజెక్టు ఎగువ ప్రాంతాలైన తూటిగుంట, కొండ్రుకోట, కొత్తూరు, చీడూరు, టేకూరు నిర్వాసిత గ్రామాల్లో ఉన్న మత్స్యకారులంతా ఉపాధి కోల్పోవడం వల్ల అధికారులు తమకు ప్రాజెక్టు ఎగువన చేపల వేటకు అనుమతులిచ్చారన్నారు. ఇటీవల రాజమహేంద్రవరం, కొవ్వూరు ప్రాంతాల నుంచి కొంతమంది మత్స్యకారులు వంద బోట్లతో ప్రాజెక్టు ఎగువ ప్రాంతాలకు వెళ్లి మత్స్యశాఖ నిబంధనలకు విరుద్ధంగా అక్కడే మకాం చేసి చీరమేన్ అవిలీ(అప్పుడే పుట్టిన చేపలను సైతం పట్టే చిన్న కన్నాలు గల వల)లతో చిన్న చేపలను సైతం పట్టి భారీ ఎత్తున ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారన్నారు. దీనివల్ల మత్స్య సంపద తగ్గి ఉపాధి కోల్పోతున్నామని ఇతర ప్రాంతాల మత్స్యకారుల చొరబాటుని అరికట్టి తమ ఉపాధిని కాపాడాలని కోరారు. అటవీక్షేత్రాధికారి దావీదురాజు మాట్లాడుతూ ఈ విషయంపై సిబ్బందితో క్షేత్రస్థాయిలో పరిశీల న చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. వైసీపీ మండల కన్వీనర్ బుగ్గా మురళీకృష్ణ, ఐటీడీఏస్ డైరెక్టర్ గంగు అనిల్‌కుమార్, వెంకటరెడ్డి ఉన్నారు.


కవిటంలో యాగం నిర్వహిస్తున్న పండితులు


అతిరుద్ర యాగ మహోత్సవాల్లో భాగంగా శ్రీవారి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

వైభవంగా అతిరుద్ర మహాయాగం

కవిటంలో కన్నులపండువగా శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారి కల్యాణం

పోడూరు, ఫిబ్రవరి 13 :కవిటం గ్రామంలో అతిరుద్ర మహాయాగం మహోత్సవాలు మూడో రోజు మంగళవారం వైభవంగా జరిగాయి. వేదపండితులు రుద్రహోమం పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. నెలమూరుకు చెందిన ఉమారామలింగేశ్వర ట్రస్ట్, శర్వాణి స్కూల్ ఆధ్వర్యంలో దాతలు, భక్తులు, గ్రామస్థుల సహకారంతో యాగ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. 56 మంది రుత్వికులచే 1,232సార్లు రుద్ర పారాయణలు ఈశ్వరునికి అభిషేకం నిర్వహించారు. 25మంది రుత్వికులచే 84సార్లు చండీ నిర్వహించారు. రుద్ర హోమం, పరమేశ్వరునికి ప్రీతిగా రుద్రక్రమార్చన త్రిశతీ అర్చన చండీహోమం వేద స్వాహాకారం అరుణ హోమం శ్రీతారా మహావిద్యా మూలమంత్ర హవనం నిర్వహించారు. యాగోత్సవాలు పురస్కరించుకుని రాత్రి తిరుమల తిరుపతి దివ్య క్షేత్రంలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి వాయిద్య మేళతాళాలతో, పండితుల మంత్రోచ్ఛరణలతో భక్తజనసందోహం మధ్య కన్నులపండువగా కల్యాణం నిర్వహించారు.

క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి

ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గోపినాథ్ రెడ్డి.. ఉత్తమ డ్రైవర్లకు సత్కారం

భీమవరం టౌన్, ఫిబ్రవరి 13 :సంస్థలో పనిచేస్తున్న డ్రైవర్లు అందరూ క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని ఆర్టీసీ విజయవాడ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.గోపినాథ్‌రెడ్డి అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. త్వరలో పశ్చిమ గోదావరి జిల్లాకు కొత్త బస్సులను కేటాయిస్తున్నట్టు తెలిపారు. జిల్లాలో ఇంతవరకు యాక్సిడెంట్ జరగని నరసాపురం డిపోను ఆయన అభినందించారు. జిల్లా రవాణా అధికారి టి.ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ డ్రైవర్లు తగిన విశ్రాంతి తీసుకుని విధులకు హాజరు కావాలని సూచించారు. ప్రమాద రహిత డ్రైవర్లలో జిల్లాస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచిన నరసాపురం డిపోకు చెందిన బీవీఆర్ అప్పారావు, ద్వితీయస్థానంలో తాడేపల్లిగూడెంకు చెందిన బీఎస్ఆర్ రాజు, తృతీయ స్థానంలో నిలిచిన భీమవరం డిపోకు చెందిన ఈఎల్‌రావులను సత్కరించారు.

డిపోల వారీగా విజేతలు..

భీమవరంలో మొదటి మూడు స్థానాల్లో కేఆర్ బాబు, ఎంఎస్ రెడ్డి, టీవీఎస్ఎన్ రాజు అవార్డులు అందుకున్నారు. నరసాపురం డిపోలో పీఎం పతి, డేవిడ్, కుమార్, తాడేపల్లిగూడెంలో కె.పెదకాపు, కేఎస్ రావు, వీవీఆర్ రెడ్డి, తణుకులో ఎంవీ రావు, సీహెచ్ శ్యామ్సన్, వీపీ రాజులను సత్కరించారు. జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.వీరయ్య చౌదరి, ఏలూరు జిల్లా ప్రజా రవాణా అధికారి వరప్రసాద్, సీఐ శ్రీనివాసరావు, విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి ఆర్టీసీ డిపో మేనేజర్లు పాల్గొన్నారు.

'నీతి, నిజాయితీతో ఓటు వేస్తేనే ప్రజాస్వామ్యం'

భీమవరంటౌన్, ఫిబ్రవరి 13: ఓటును స్వచ్ఛందంగా నీతి నిజాయితీతో వేసినప్పుడే నిజమైన ప్రజాస్వామ్యానికి మార్గదర్శకమని, ఓటు వేసే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించి సమర్థవంతమైన నాయకత్వానికి ఓటు వేయాలని ఆటో యూనియన్ నాయకులు వెంకటేశ్వరరావు, నిరీక్షణరావు, యాకూబ్, శ్రీనివాస్‌రావు, లక్ష్మణరావు అన్నారు. రెవెన్యూ శాఖ, శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పాత బస్టాండ్ ఆటోయూనియన్ నాయకులతో 'ఓటు హక్కు వినియోగం ప్రజాస్వామ్య పరిరక్షణ' అంశంపై డ్రైవర్స్‌తో ర్యాలీ, సదస్సు, ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులుగా మనమంతా ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగంగా నీతికి పట్టం కట్టాలని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి స్వచ్ఛమైన ఓటు ప్రతిజ్ఞ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో భీమవరం టౌన్ వైడ్ ఆటో యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 13 :కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వివాహిత రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడింది. ఏలూరు రైల్వేపోలీస్ స్టేషన్ పరిధిలోని పవర్‌పేట రైల్వేస్టేషన్ సమీపంలో మంగళవారం ఉదయం ఓ మహిళ మృతదేహం ఉన్నట్టు రైల్వే పోలీసులకు సమాచారం అందింది. రైల్వే ఎస్ఐ నరసింహారావు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఏలూరు రామచంద్రరావుపేట ఈదరవారి వీధినకు చెందిన సంబారు కనకదుర్గ(41) కుటుంబ కలహాల నేపథ్యంలో తీవ్ర మనస్తాపంతో రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడినట్టు గుర్తించారు. మృతదేహానికి పోస్టుమార్టం జరిపి బంధువులకు అప్పగించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 13:ఆటో యూనియన్ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఓ ఆటో డ్రైవర్ మనస్తాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఏలూరు కొమడవోలు ప్రాంతానికి చెందిన చలపరెడ్డి మురళీ ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. తొలుత ఆశ్రం సెంటర్‌లో ఒక హోటల్ నిర్వహించుకునేవాడు. ట్రాఫిక్ సమస్య నేపథ్యంలో ఆ ప్రాంతంలో షాపులన్నీ తొలగించడంతో మళ్లీ ఆటోను కొనుగోలు చేసుకుని ఆ సెంటర్‌లోనే జీవిస్తున్నాడు. మద్యం తాగి ఆటోను నడపడంతో యూనియన్ వారు 15 రోజుల పాటు ఆటో నడపవద్దని, మద్యం తాగితే ప్రయాణికుల ప్రాణాలకు ప్రమాదం ఉందని సూచించారు. మళ్లీ ఆశ్రం సెంటర్‌లోని పాత హోటల్ స్థలంలో హోటల్ పెట్టే ప్రయత్నం చేయగా ఆ స్థలంలో ఆటో యూనియన్ స్టాండ్ అని బోర్డు పెట్టడంతో మనస్తాపంతో మంగళవారం మధ్యాహ్నం అక్కడే పెట్రోలు పోసుకుని అంటించుకుని పక్కనే ఉన్న ఏలూరు కాలువలో దూకేశాడు. తీవ్ర గాయాల పాలైన అతడిని ఏలూరు ప్రభుత్వాసు పత్రికి, మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరుకు రిఫర్ చేశారు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం అందించారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 13 : ఏలూరు రూరల్ మండలం కొత్తూరు ఇందిరమ్మ కాలనీలో ఓ వ్యక్తి మద్యం విక్రయిస్తున్నాడని ఏలూరు రూరల్ ఎస్ఐ కె.రాజారెడ్డికి సమాచారం అందింది. తన సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్ళి దాడి చేశారు. బారు రాజా అనే వ్యక్తి మద్యం విక్రయిస్తున్నట్టుగా గుర్తించి అతడిని అరెస్టు చేశారు. అతడి నుంచి తొమ్మిది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

ఆటో బోల్తా.. ఐదుగురికి గాయాలు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 13 : వేగంగా వెళ్తున్న ఆటోకు మోటారు సైక్లిస్టు అడ్డురావడంతో అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఏలూరు శాంతినగర్ 9వ రోడ్డునకు చెందిన ఆటో డ్రైవర్ టి.రఘు తన ఆటోలో ఫిరంగుల దిబ్బ ప్రాంతానికి చెందిన తల్లిబోయిన కుమారి, తల్లిబోయిన ఇంద్రజ, కారెటి దుర్గ, సాత్రపోయిన రాజరాజేశ్వరిలను కూలి పనుల నిమిత్తం పినకడిమి తీసుకువెళ్తున్నారు. మార్గమధ్యలో శనివారపుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆకస్మాత్తుగా మోటారుసైక్లిస్టు అడ్డం వచ్చాడు. ఆటో అదుపుతప్పి బోల్తా పడిన ప్రమాదంలో ఆటోలో ఉన్న వారికి గాయాలు కాగా ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదుచేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం అందించారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

తణుకు, ఫిబ్రవరి13 : వివాహిత అదృశ్యంపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. తణుకు మండలం తేతలి గ్రామానికి చెందిన దొంగా దుర్గాభవాని ఇంటి నుంచి ఈనెల 12వ తేదీన బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో ఆమె భర్త నాగేంద్ర పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీరికి ఆరేళ్ల క్రితం వివాహమైంది. ఇద్దరు పిల్లలు ఉన్నారు. రూరల్ ఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

27 తెలంగాణ మద్యం సీసాలు స్వాధీనం

నూజివీడు, ఫిబ్రవరి 13: నూజివీడు సెబ్ పరిధిలో నిర్వహించిన దాడుల్లో ఒకరిని అదుపులోకి తీసుకుని తెలంగాణ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని నూజివీడు సెబ్ సీఐ వెంకటరమణ తెలిపారు. నూజివీడు సెబ్ స్టేషన్ పరిధిలోని చాట్రాయి మండలం కృష్ణారావుపాలెంలో నిర్వహించిన దాడుల్లో ఎ.కొండూరు మండలం చీమలపాడుకు చెందిన బూక్యా పండుబాబును అదుపులోకి తీసుకుని అతడి నుంచి 27 తెలంగాణ మద్యం సీసాలను స్వాధీన పరుచుకున్నట్టు ఆయన తెలిపారు.


ద్వారకాతిరుమలలో బాధిత బాలుడితో మాట్లాడిన అధికారులు

బాలుడిపై చిత్రహింస కేసులో రాజీ యత్నాలు

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 13: ద్వారకాతిరుమలలోని తూర్పువీధినకు చెందిన ఓ బాలుడిపై అతడి యజమాని దాడికి పాల్పడిన ఘటనపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మేరీ ఆదేశాల మేరకు మహిళా కానిస్టేబుల్ లక్ష్మీసుజన, లక్ష్మి, కొల్లి జయ తదితరులు బాధిత కుటుంబాన్ని మంగళవారం విచారించారు. బాలుడి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి, జరిగిన ఘటన వివరాలను అడిగి నమోదు చేసుకున్నారు. మరో మహిళతో ఉన్న అక్రమ సంబంధం విషయంలో తన భార్యకు చెప్పాడన్న అనుమానంతో గ్రామానికి చెందిన నాగబాబు తనవద్ద పనిచేసే వీరవరపు శివ అనే బాలుడిని ఇటీవల చిత్రహింసలకు గురిచేయగా, అతను భయపడి పారిపోయిన విషయం తెలిసిందే. అనంతరం పాలకొల్లులో ఉన్న బాధిత బాలుడిని పోలీసులు తీసుకొచ్చి చికిత్స జరిపించారు. ఆ తరువాత చికిత్స పొంది ఇంటికి చేరుకున్న ఆ బాలుడిని అధికారులు పూర్తిస్థాయిలో విచారించారు. ఈ క్రమంలో బాలుడి కేసు నీరుగార్చేందుకు గాను కొంతమంది రాజీ ప్రయత్నాలు చేస్తున్నట్టు సామాజిక మాధ్యమాల్లో కథనాలు హల్‌చల్ చేస్తున్నాయి. రూ.10 వేల నుంచి లక్ష రూపాయల వరకు బేరసారాలు జరిగినట్లు చెబుతున్నారు. బాలుడి తల్లిని ఒప్పించేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారని ప్రచారం జరుగుతోంది. అయితే పోలీసుల సమక్షంలోనే మాకు న్యాయం జరగాలని బాధితులు స్పష్టం చేస్తున్నట్టు సమాచారం.

బస్సు ఎక్కుతుండగా రూ.2.30 లక్షల చోరీ

తణుకు, ఫిబ్రవరి13 : తణుకు ఆర్టీసీ బస్టాండులో ఓ వ్యక్తి విజయవాడ వెళ్లే బస్సు ఎక్కుతుండగా హ్యాండ్‌బ్యాగ్ నుంచి గుర్తుతెలియని వ్యక్తులు రెండు లక్షలు 30 వేలు రూపాయలు దొంగిలించారు. విజయవాడకు చెందిన గొర్ల ప్రభాకరరెడ్డి ప్రతివారం తణుకు, తాడేపల్లిగూడెం, ఏలూరు ప్రాంతాలకు వ్యాపారుల నుంచి వసూళ్లకు వస్తుంటారు. ప్రతివారం మాదిరిగానే కలెక్షను అయిన తర్వాత రెండు లక్షలు 30వేలు రూపాయలను హ్యాండ్‌బ్యాగ్‌లో పెట్టుకుని సోమవారం రాత్రి ఏడున్నర ప్రాంతంలో విజయవాడ బస్సు ఎక్కుతుండగా కొంతమంది గ్రూపుగా ఏర్పడి అందులో ఒకరు కడుపు నొప్పి అని చెబుతూ ఉండగా రద్దీగా ఉండేలా చేసి బ్యాగులో ఉన్న డబ్బులు జిప్ తీసి చోరీ చేశారు. బస్సు ఎక్కిన తర్వాత చూసే సరికి జిప్ తీసి ఉండడం గమనించి డబ్బులు చూసుకుంటే కనిపించలేదు. వెంటనే బస్సు దిగి చూసిన కూడా ఎవరూ కనపించకపోవడంతో చేసేది లేక లబోదిబో మంటూ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ప్రభాకరరెడ్డి తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ముసునూరు, ఫిబ్రవరి 13: బలివే తమ్మలేరు నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. బలివే గ్రామానికి చెందిన కాట్రు చిన్న రామలింగం, కాట్రు పెదరామలింగం తమ ట్రాక్టర్లతో అనుమతులు లేకుండా తమ్మిలేరులో ఇసుకను తీసుకువెళ్తుండగా ఎస్ఐ వాసు, సిబ్బందితో దాడి చేసి ట్రాక్టర్లను ముసునూరు తహసీల్దార్ జవహర్ బాజీకి రిఫర్ చేశారు. ఒక్కొక్క ట్రాక్టర్‌కు రూ. 5 వేలు చొప్పున జరిమానా విధించినట్టు తహసీల్దార్ తెలిపారు.

12 మంది జూదరుల అరెస్ట్

పది సెల్‌ఫోన్లు.. రూ.42 వేలు స్వాధీనం

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 13 :ఏలూరు సమీపంలోని సత్రంపాడు సీతారామ్‌పురం రోడ్డులోని ఓ అపార్టుమెంటులో పేకాట జరుగుతున్నట్లు ఉన్నతాధికారులకు సమాచారం అందింది. జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి, ఎస్ఈబీ అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు ఆదేశాల మేరకు ఎస్ఈబీ సీఐ సునీల్‌కుమార్ తన సిబ్బందితో మంగళవారం రాత్రి దాడి చేశారు. అక్కడ పేకాట ఆడుతున్న 12 మందిని అరెస్టు చేసి వారి నుంచి 42 వేల రూపాయల నగదు, పది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వారిని ఏలూరు త్రీటౌన్ పోలీసులకు అప్పగించారు. త్రీటౌన్ సీఐ వి.వెంకటేశ్వరరావు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రిమిసంహారక మందుల నిల్వపై తనిఖీలు

షాపు యజమాని వెంకటేశ్వరరావుపై కేసు


షాపులో తనిఖీ చేస్తున్న అధికారులు

భీమవరం క్రైం, ఫిబ్రవరి 13 : ఓ దుకాణంలో గడువు తీరిన క్రిమి సంహారక మందులు నిల్వ ఉన్నట్టు వచ్చిన సమాచారం మేరకు రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఏలూరు కరణం కుమార్ ఆదేశాల భీమవరంలో తనిఖీలు నిర్వహించారు. భీమవరం రెస్ట్‌హౌస్ రోడ్డులోని అష్టఐశ్వర్య ఆగ్రో ఏజెన్సీస్‌లో విజిలెన్స్, రెవెన్యూ, పౌర సరఫరాల అధికారులు సంయుక్తంగా మంగళవారం తనిఖీ చేశారు. ఈ తనికీల్లో రూ.3,63,780 విలువైన 308.50 లీటర్లు/కేజీల గడువు తీరిన క్రిమి సంహారక మందులు గుర్తించారు. తదుపరి రూ.17,700 విలువైన 1,430 కేజీల వేప పిండి అక్రమంగా నిల్వ చేసినట్టు గుర్తించారు. రూ.3,81,480 విలువైన స్టాక్‌ను సీజ్ చేసి షాపు యజమాని చక్కా వెంకటేశ్వరరావుపై కేసు నమోదు చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ పి.శివరామకృష్ణ, విజిలెన్స్ ఏవో పి.సురేష్, అగ్రికల్చర్ ఏడీ భీమవరం సీహెచ్ శ్రీనివాసు, ఏవో భీమవరం ఎస్.శ్రీనివాసు, రెవెన్యూ, పౌర సరఫరాల అధికారులు పాల్గొన్నారు.

పోలవరాన్ని గిరిజన జిల్లాగా ఏర్పాటు చేయాలి

ఐక్య కార్యాచరణ కమిటీ డిమాండ్

పోలవరం, ఫిబ్రవరి 13: పోలవరం కేంద్రంగా ప్రత్యేక గిరిజన జిల్లా ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఊపందుకుంది. పోలవరం ప్రాజెక్టులో ముంపునకు గురైన ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల గిరిజన, గిరిజనేతర నిర్వాసితుల్ని ఒకే జిల్లాగా ఏర్పాటు చేసి అభివృద్ధి పరచవలసిన అవసరం ఉందని ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఎప్పటినుంచో ప్రత్యేక గిరిజన జిల్లా ప్రతిపాదన ఉందని గిరిజన జిల్లా సాధన కోసం ప్రతి ఒక్కరూ పార్టీలకు కులాలకు అతీతంగా పని చేయాలని జేఏసీ నాయకులు నాళం గాంధీ, బుగ్గా మురళీకృష్ణ, సొబ్బన మోహన్ మంగిన కొండ పిలుపునిచ్చారు. ఈమేరకు మొదటిగా పోలవరంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ ఉద్యమం ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలోని అన్ని ఏజెన్సీ మండలాల్లో గిరిజన నియోజకవర్గాల్లోని నాయకులు, ప్రజలతో కలసి విస్తృత పరచనున్నట్లు వారు తెలిపారు. ఈమేరకు ఈనెల 17న వేలాది మందితో పోలవరంలోని ఏటిగట్టు సెంటర్లో మహాధర్నా కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. మంగళవారం పోలవరంలోని టీడీపీ మండల కార్యాలయం వద్ద టీడీపీ మండల నాయకుడు మంగిన కొండ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల నిర్మానుష్యంగా మారి వర్తక వాణిజ్యాలు దెబ్బతిని వర్తకులు, పంట భూములు కోల్పోయి రైతులు, ఉపాధిలేక పేదలు అవస్థలకు గురవుతున్నారన్నారు. మళ్ళీ పోలవరానికి పూర్వ వైభవం రావాలంటే గిరిజన మండలాలన్నింటినీ కలిపి ప్రత్యేక గిరిజన గిరిజన జిల్లాగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

సర్వర్ సమస్యతో రిజిస్ట్రేషన్లకు ఇక్కట్లు

నాలుగు రోజులుగా లబ్ధిదారుల ఎదురుచూపు


ఆకివీడులో సచివాలయం వద్ద వేచివున్న మహిళలు

ఆకివీడు, ఫిబ్రవరి 13: పేదల ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ లబ్ధిదారులతో పాటు ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సర్వర్ సమస్యతో లబ్ధిదారులు గంటల కొద్ది వేచి చూడాల్సి వస్తుంది. జిల్లాలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ జనవరి 31న ప్రారంభించి, ప్రభుత్వ ఆదేశాల మేరకు సెలవు రోజుల్లో కూడా రిజిస్ట్రేషన్లు చేస్తున్నా సర్వర్ సమస్యలతో ముందుకు సాగడంలేదు. నాలుగురోజులుగా ఉద్యోగులు రాత్రి, పగలు ఆ పనుల్లోనే నిమగ్నమవుతున్నా సాంకేతిక సమస్యలతో సమయం వృథా కావడంతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. ఇంటి దగ్గర పనులు మానుకుని నాలుగు రోజుల నుంచి సచివాలయాలు చుట్టూ తిరుగుతున్నా రిజిస్ట్రేషన్లు కావడం లేదని జవ్వాది కుమారి, మణిపూరి లక్ష్మి మంగళవారం ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయాల దగ్గరకు భోజనాలు తెచ్చుకొని ఇక్కడే తింటూ రాత్రి పది గంటల వరకూ వేసిచూసి నిరాశతో వెనుతిరిగి వెళ్లాల్సి వస్తుందంటూ మండిపడుతున్నారు. పాలకులు, అధికారులు వెంటనే సర్వర్ సమస్యలు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అప్రెంటిస్‌పై నిరసన : డీఎస్సీ జీవో ప్రతి దహనం


జీవో ప్రతులు దహనం చేస్తున్న యూటీఎఫ్ నేతలు

చింతలపూడి, ఫిబ్రవరి 13: ప్రభుత్వం డీఎస్సీ-2024 నోటిఫికేషన్ ద్వారా అమలు చేయనున్న అప్రెంటిస్ విధానంపై నిరసన పెల్లుబుకుతోంది. ఈ విధానం రద్దు చేయాలని యూటీఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం డీఎస్సీ జీవో ప్రతి దహనం చేశారు. యూటీఎఫ్ నాయకులు బుచ్చిబాబు మాట్లాడుతూ 30 ఏళ్ల పోరాడి సాధించుకున్న అప్రెంటిస్ రద్దును ముఖ్యమంత్రి జగన్ అమలులోకి తీసుకురావడం దారుణమన్నారు. ఏ శాఖలో అప్రెంటీస్ విధానంలేదని, విద్యాశాఖలో ఉపాధ్యాయులకు శాపమన్నారు. తిరోగమన జీవోను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ నాయకులు దామోదర్, చెంచెం రాజు, ప్రేమ్‌కుమార్, శ్రీను, వెంకటేశ్వరరావు, రాము, సురేష్, బాలకృష్ణ పలువురు పాల్గొన్నారు.

భూహక్కు చట్టం రద్దు చేయాలి : సీపీఎం



సమావేశంలో మాట్లాడుతున్న సీతారాం

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 13: రైతులకు ప్రజలకు తీవ్ర నష్టం కలిగించే భూహక్కు చట్టాన్ని జగన్ ప్రభుత్వం రద్దు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు మంతెన సీతారాం డిమాండ్ చేశారు. సీపీఎం కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం రామకృష్ణ అధ్యక్షతన మంగళవారం జరిగింది. చిన్న, సన్నకారు రైతులకు ఈ చట్టం ప్రమాదకరమన్నారు. కిందిస్థాయి కోర్టులకు వెళ్లకుండా చట్టంలో పేర్కొనడం దుర్మార్గం అన్నారు. చిన్న రైతులకు హైకోర్టుకు వెళ్లే సామర్థ్యం ఉంటుందా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ కార్మిక సమస్యలు పరిష్కరించకుండా అణచివేతకు పాల్పడుతుందని దుయ్యబట్టారు. జిల్లా కార్యదర్శి రవి మాట్లాడుతూ చింతలపూడి ఎత్తిపోతల పథకం నిర్మాణాన్ని పూర్తి చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. రైతుల ఉద్యమానికి సీపీఎం మద్దతు ఇస్తుందన్నారు. ప్రసాద్, కిషోర్, లింగరాజు, నాగమణి, రాజు, జీవరత్నం, సోమయ్య పాల్గొన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 13: ఢిల్లీలో రైతులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రైతులు శాంతియుతంగా నిర్వహిస్తున్న చలో ఢిల్లీ కార్యక్రమంపై మోదీ ప్రభుత్వం నిర్బంధ చర్యలకు దిగడం దారుణమన్నారు. ముళ్ళతీగలు, కాంక్రీటు బారికేడ్లు పెద్దఎత్తున పోలీస్ బలగాలు మొహరించటం దుర్మార్గమైన చర్య అన్నారు. మూడు వ్యవసాయ నల్లచట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో రైతులు 13 నెలల పాటు ఉద్యమం నిర్వహించిన సందర్భంగా కేంద్రం రాతపూర్వకంగా ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు.

16న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



సమ్మె జయప్రదం చేయాలని హమాలీల నినాదాలు

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 13: ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె, గ్రామీణ బంద్ జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ నేత కేవీ.రమణ పిలుపునిచ్చారు. కేఆర్.పురం గిరిజన కార్పొరేషన్ సివిల్ సప్లై హమాలీల సమావేశం కోర్స కిషోర్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. రమణ మాట్లాడుతూ రైతుల ఆందోళన సమయంలో అనేక హామీలను ఇచ్చిన కేంద్రం ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. నల్ల చట్టాలకు వ్యతిరేకంగా రైతులు పోరాటాన్ని విరమించడానికి, చట్టాల ఉపసంహరణ, గిట్టుబాటు ధరలు, అక్రమ కేసుల ఎత్తివేత, నలుగురిని కారుతో తొక్కించి చంపిన మంత్రిని పదవి నుంచి తొలగిస్తామనే హామీలు అమలు కాలేదన్నారు. పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దుచేసి కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా లేబర్ కోడ్‌లు తెచ్చారని, 12 గంటల పని విధానాన్ని పార్లమెంటులో ఆమోదించారని వీటిని రద్దు చేసుకునేవరకు కార్మికులు పోరాటాలు చేస్తూనే ఉంటారని తెలిపారు. కేంద్రం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై రైతులు, కార్మికులు ఆందోళనలు చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో మీసాల ఏసు, డి.రాజు, కె.రాజేష్, కె.రవివర్మ, కె.చందు, పి.అనిల్ తదితరులు పాల్గొన్నారు.

● చింతలపూడి: దేశవ్యాప్తంగా వ్యవసాయ కూలీలు, కార్మిక కర్షకులు మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తలపెట్టిన జాతీయ సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు ఆర్‌వి.సత్యనారాయణ కోరారు. కరపత్రాలను ఆవిష్కరించి ప్రదర్శన నిర్వహించారు. ఎం.బాలరాజు, నాయకులు పాల్గొన్నారు.

● ఏలూరు టూటౌన్: కేంద్రం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ 16 సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ డాంగే పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యాలయంలో సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, ఏఐటీయూసీ సంఘాల సమావేశం జరిగింది. బద్దా వెంకట్రావు, కే.బుజ్జిబాబు, బండి వెంకటేశ్వరరావు, కృష్ణమాచార్యులు, కన్నబాబు, శ్రీనివాసరావు, కాకి నాని, జగన్నాథం, గోపి తదితరులు పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలు, రైతు ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16న జరిగే భారత్‌బంద్‌ను జయప్రదం చెయాలని ఏపీ రైతు సంఘం నాయకులు కోరారు. మండల అధ్యక్ష ఉపాధ్యక్షులు దాసరి జానకిరామిరెడ్డి, బిక్కిన వీరసత్యం రైతు, కార్మికులతో సమావేశమయ్యారు.

● ఉంగుటూరు: కార్మిక,కర్షక సమస్యల పరిష్కారం కోసం జరిగే గ్రామీణ బంద్ జయప్రదం చేయాలని కౌలు రైతుల సంఘం జిల్లా కన్వీనర్ కొర్ని అప్పారావు కోరారు. రైతు, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో కైకరంలో ప్రచారం నిర్వాహించారు.

జామీను లేకుండా స్వల్పకాలిక రుణాలు ఇవ్వాలి


బ్యాంక్ మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

చింతలపూడి, ఫిబ్రవరి 13: రైతులు, కౌలు రైతులకు జామీను లేకుండా స్వల్ప కాలిక రుణాలు ఇవ్వాలని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య డిమాండ్ చేశారు. యూనియన్ బ్యాంకు వద్ద మంగళవారం రైతులతో ధర్నా చేశారు. రైతులకు పంట రుణాలు ఇవ్వాలంటే పట్టాదారు పాస్‌పుస్తకం, టైటిల్ డీడ్ 1బితో పాటు జామీను అడగడం నిబంధనలకు విరుద్ధం అన్నారు. కౌలు కార్డులు పొందిన రైతులకు ఎటువంటి జామీనులేని పంట రుణాలు జారీ చేయాలన్నారు. రేచర్ల, మల్లాయిగూడెం, సమ్మెటవారిగూడెం, ఎర్రగుంటపల్లి, పాతచింతలపూడి గ్రామాల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ధర్నాలో రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సోమశేఖర్, డి.కృష్ణ, ప్రసాద్, ఎస్.కె.జానీ, టి.బాబు తదితరులు ధర్నా అనంతరం మేనేజర్‌ను కలసి వినతిపత్రం అందజేశారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలించిన అధికారులు


పోలింగ్‌బూత్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 13: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏలూరు రూరల్ ఎస్ఐ కె రాజారెడ్డి తన సిబ్బందితో గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను మంగళవారం పరిశీలించారు. క్షేత్రస్థాయిలో పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు, అనువైన ప్రదేశాలు పరిశీలించారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం లేకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పరిశీలన నిర్వహించారు. ఏ పోలింగ్ కేంద్రాలకు ఏ సదుపాయాలు అవసరమవుతాయో కూడా సూచించారు. రూరల్ తహసీల్దార్ నరసింహారావు కూడా సిబ్బందితో కేంద్రాన్ని పరిశీలించారు. పైడిచింతపాడు, చాటపర్రు, ప్రత్తికోళ్ళలంక, మొండికోడు, కోటేశ్వర దుర్గాపురం, గుడివాకలంక గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

రహదారి భద్రత నిబంధనలతో ప్రమాదాల నివారణ


సదస్సులో మాట్లాడుతున్న ఎంవీఐ ప్రసాద్

జంగారెడ్డిగూడెం టౌన్, ఫిబ్రవరి 13: రహదారి భద్రత, ట్రాఫిక్ నియమాలు విధిగా పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని ఎంవీఐ కేవీఎస్.ప్రసాద్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఉప రవాణా కమిషనర్ ఎస్.శాంతకుమారి ఆధ్వర్యంలో మంగళవారం ట్రాక్టర్, లారీ డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ప్రాణం చాల విలువైనదని, అతివేగం, అవగాహన లోపం, నిర్లక్ష్యంతో ప్రాణాపాయం సంభవిస్తుందన్నారు. ప్రమాదాల్లో ప్రాణ నష్టంతో పాటు మృతుల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. వాహనాలపై అధిక లోడు వేయడం వలన వాహనం అదుపు తప్పి ప్రమాదాలు జరగడంతో పాటు వాహన ఇంజన్, రహదారులు త్వరగా పాడవుతాయని తెలిపారు. కార్యక్రమములో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వీఎల్.ప్రవీణ, నవభారత్ పామాయిల్ పరిశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

ఒప్పందం ఏమైంది..?

ప్రభుత్వ తీరుపై మున్సిపల్ కార్మికుల నిరసన



ఏలూరులో మున్సిపల్ కార్మికుల నిరసన ప్రదర్శన


జంగారెడ్డిగూడెంలో వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ కార్మికులు



చింతలపూడి మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికుల ధర్నా

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 13: ఇటీవల మున్సిపల్ కార్మికుల సమ్మె సందర్భంగా ప్రభుత్వ చర్చల్లో ఒప్పందాలు ఏమయ్యాయని, ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం కాలయాపన చేయడంపై నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌ఆర్.పేటలో మంగళవారం మున్సిపల్ కార్మికుల నిరసన కార్యక్రమం చేపట్టారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి అప్పలరాజు మాట్లాడుతూ అవుట్‌సోర్స్, కాంట్రాక్టు సిబ్బందికి జీతాలు పెంచాలన్నారు. రెగ్యులర్ ఉద్యోగులకు సరండర్ లీవుల నగదు చెల్లించాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలతో జీవోలు జారీ చేయాలన్నారు. నారాయణరావు, వెంకటేశ్వరరావు, సుబ్బారావు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం టౌన్: మున్సిపల్ కార్మికుల సమ్మె సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా అధ్యక్షుడు కె.విఘ్నేశ్ డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయం వద్ద రెండో రోజు నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కొన్ని సమస్యల పరిష్కారానికి అంగీకరించడంతో సమ్మె తాత్కాలికంగా వాయిదా వేశామన్నారు. జీవో విడుదల చేస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకూ పట్టించుకోలేదన్నారు. జీవోలు జారీ చేయకుంటే మళ్లీ సమ్మెలోకి వెళతామని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయ మేనేజర్ కె.వెంకటరమణకు వినతిపత్రం సమర్పించారు జేవీ.రమణరాజు, కొత్తూరి నాగేశ్వరావు, బొక్కా శ్రీనివాస్, రేలంగి నాగరాజు, సోమయదుల వీరప్రసాద్, యడ్లపల్లి ప్రసాద్, అల్లే శ్రీను, రేలంగి ప్రవీణ్, దోసూరి చంద్రయ్య, దూలపల్లి రాంబాబు, కంతేటి వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

● చింతలపూడి: ప్రభుత్వం ఇచ్చిన హామీలతో జీవోలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మునిసిపల్ వర్కర్లు ధర్నా నిర్వహించారు. యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తొర్లపాటి బాబు మాట్లాడుతూ సమ్మె విరమణ సమయంలో మంత్రివర్గ ఉపసంఘం, ఉన్నతాధికారులు మునిసిపల్ కార్మికుల సమక్షంలో హామీలు ఇచ్చారని, నెల రోజులు కావస్తున్నా జీవోల జారీ చేయలేదన్నారు. తక్షణం వీటికి జీవోలు జారీ చేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు. చింతలపూడి నగర పంచాయతీలో 50 మంది పని చేస్తుండగా, 30 మందిని మాత్రమే ఆప్కాస్‌లో నమోదు చేశారని, మిగిలిన 20 మందిని కూడా నమోదు చేయాలన్నారు. నగర పంచాయతీ జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలన్నారు. ధర్నా కార్యక్రమంలో మునిసిపల్ వర్కర్లు వెలగాడి అనురాధ, వెంకటయ్య, సర్వేశ్వరరావు, చిన్నయ్య, సాయమ్మ, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

నిలువు దోపిడీ చేస్తున్న వైసీపీ ప్రభుత్వం


సమావేశంలో మాట్లాడుతున్న అప్పలనాయుడు

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 13: వైసీపీ ప్రభుత్వమని ప్రజలను నిలువునా దోపిడీ చేస్తుందని జనసేన జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు మండిపడ్డారు. జనసేన కార్యాలయం వద్ద మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఏపీలో తుగ్లక్ పాలన కొనసాగుతుందన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిపై అక్రమంగా కేసులు పెడుతున్నారన్నారు. నియంతగా వ్యవహరిస్తున్న జగన్‌ను వచ్చే ఎన్నికల్లో గద్దె దింపాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజలపై అదనపు భారాలు మోపుతున్న జగన్‌ను ఇంకా ప్రజలు పీఠంపై ఉంచరని స్పష్టం చేశారు. సమావేశంలో జనసేన నాయకులు ఒబిలిశెట్టి శ్రావణకుమార్, నగిరెడ్డి కాశీ నరేష్, సరిది రాజేష్, దోసపర్తి రాజు, కందుకూరి ఈశ్వరరావు, ఎట్రించి ధర్మేంద్ర, బొత్స మధు, పైడి లక్ష్మణరావు, రవి, బోండా రామునాయుడు, వీరంకి పండు, రెడ్డి గౌరీశంకర్, నూకల సాయి, తదితరులు ఉన్నారు.

45వ డివిజన్‌కు చెందిన 15 మంది యువకులు జనసేన జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు సమక్షంలో పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

బీజేపీని మరింత బలోపేతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న అప్పలనాయుడు

దెందులూరు, ఫిబ్రవరి 13: బీజేపీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని, వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలతో కలసి పోరాటం చేస్తామని నియోజకవర్గ కన్వీనర్ గుమ్మడి వెంకట చైతన్యకృష్ణ అన్నారు. కొవ్వలిలో మండల అధ్యక్షుడు మందూరి బుజ్జి గోపాల్‌తో కలసి మంగళవారం పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను అందించారు. కార్యక్రమంలో తోట ఆంజనేయులు, సర్వేశ్వరరావు, పెనుబోయిన రమేష్, జంగం నారాయణ, అఖిల్, గణేష్, శేఖర్, గుజ్జుల బాబురావు, వెంకన్నబాబు, నీలం గణేష్, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

● లింగపాలెం: మండలంలో బీజేపీ కిసాన్‌మోర్చా కార్యవర్గ సభ్యుడు రాయంకుల చక్రధరరావు, కుర్రా సుబ్రహ్మణ్యేశ్వర ప్రసాద్ ఆధ్వర్యంలో పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. కె.గోకవరం, పాశ్చాయ్యానగరం, అన్నపనేనివారిగూడెం, వేములపల్లిలో కేంద్ర పథకాలు వివరించారు. తాతిన సత్యనారాయణ, మరీదు గంగబాబు, పరసా కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

● భీమడోలు: మండలంలోని పలు గ్రామాల్లో పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. కురెళ్ళగూడెం, వడ్లపట్ల, భీమడోలు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి బీజేపీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. ఉంగుటూరు కో కన్వీనర్ ధర్మారావు, గంధం భాస్కరరావు, మిద్దే రమాదేవి, సుశీలారాణి, వర్ధినీడి కపిరాజు, వర ప్రసాద్‌బాబు, లాల్ బహదూర్ శాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

షర్మిలను కలవనివ్వలేదని కాంగ్రెస్ నేత రాజీనామా

ద్వారకాతిరుమల ఫిబ్రవరి 13: పీసీసీ అధ్యక్షురాలు షర్మిలను కలవకుండా అగ్రనాయకులు అడ్డుకున్నారని మనస్తాపంతో రామన్నగూడెం మాజీ సర్పంచ్ పీటీ.భీమేశ్వరరావు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. పార్టీలో సీనియర్లకు గుర్తింపునివ్వడం లేదని మంగళవారం ఆయన ఒక ప్రకటనలో అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా వైఎస్.షర్మిల బాధ్యతలు చేపట్టడం ఎంతో సంతోషం కలిగించిదన్నారు. కానీ కొందరు రాష్ట్ర నాయకులతో పార్టీ నష్టపోతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్‌కు రాజీనామా పత్రం వాట్సాప్ ద్వారా పంపించినట్లు తెలిపారు.

వసతిగృహ విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లు


సమావేశంలో మాట్లాడుతున్న ఐవోసీ డీజీఎం

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 13: శనివారపుపేట ప్రభుత్వ బాలుర వసతి గృహం విద్యార్థులకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ తరపున స్పోర్ట్స్ కిట్లను అందించారు. వసతి గృహ ప్రాంగణంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వాలీబాల్, షెటిల్ బాడ్మింటన్, చెస్‌కు సంబంధించిన స్పోర్ట్స్ కిట్లను అందజేశారు. ఐవోసీ డీజీఎం వి.కుమార్, సెక్షన్ ఆఫీసర్ పి.తిమ్మప్ప, వసతిగృహ సూపరింటెండెంట్ పి.మధుసూదనరావు, సివిల్ అసిస్టెంట్ సర్జన్ పి.కిషోర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తరలింపు : ఇద్దరిపై కేసు

జీలుగుమిల్లి, ఫిబ్రవరి 13: ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టరును దర్భగూడెం దాబా సమీపంలో పట్టుకున్నట్లు ఎస్సై వి.చంద్రశేఖర్ తెలిపారు. చిర్రివారిగూడెంకు చెందిన డ్రైవర్ ఎం.నవీన్‌బాబు మడకంవారిగూడెంకు చెందిన ట్రాక్టరు ఓనర్ ఎస్.అప్పారావుపై కేసు నమోదు చేశారు.

వసంత పంచమికి ఆలయాలు ముస్తాబు


ముస్తాబైన పాండురంగస్వామి ఆలయం

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 13 : వసంత పంచమి సందర్భంగా నగరంలోని పలు ఆలయాలను సరస్వతీ పూజల నిర్వహణకు ముస్తాబు చేశారు. పాతబస్టాండ్ సెంటర్‌లోని పాండురంగ స్వామి ఆలయం వద్ద ప్రత్యేక వేదికపై సరస్వతీదేవి రూపాన్ని ఏర్పాటు చేశారు. గురువారం విద్యార్థులతో సామూహిక పూజలు జరుపుతామని ఆలయ అర్చకులు దండిబొట్ల కనక సుందరశర్మ, ఆలయ ఈవో సీహెచ్. చిననాగేశ్వరరావు తెలిపారు. అగ్రహారంలోని పాత శివాలయం ప్రాంగణంలో జ్ఞాన సరస్వతీదేవికి సామూహిక పూజలు చేస్తామని నిర్వాహకులు తెలిపారు. నగరంలోని కనకదుర్గమ్మ, అంబికాదేవి, సౌభాగ్యలక్ష్మి, రాజ్యలక్ష్మి, బాల త్రిపుర సుందరి అమ్మవార్లను సరస్వతీదేవిగా అలంకరించనున్నారు.

అభయాంజనేయ ఆలయం వద్ద అన్న సమారాధన

పెదపాడు, ఫిబ్రవరి 13: అప్పనవీడు అభయాంజనేయస్వామి ఆలయం వద్ద దాతల సహకారంతో సుమారు 200 మందికి మంగళవారం అన్న సమారాధన నిర్వహించారు. తొలుత స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి సింధూరార్చన, అభిషేకాలను నిర్వహించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ఛైర్మన్ నెర్సు భూషణం, ఈవో కూచిపూడి శ్రీనివాసర్, దాత బోదటి శ్రీనివాసరావు, వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

నారాయణపురంలో వైభవంగా వెంకన్న ఊరేగింపు


వేంకటేశ్వరస్వామి ఊరేగింపు

ఉంగుటూరు, ఫిబ్రవరి 13: నారాయణపురంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. మంగళవారం స్వామి అమ్మవార్ల ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. గుర్రపు బండిపై స్వామి అమ్మవార్లను ఉంచి, బ్యాండ్‌మేళం,తీన్‌మార్ డప్పులతో గ్రామంలో ఊరేగించారు.

మిర్చిపై నల్లమచ్చ నివారణకు సూచనలు


రైతులకు సూచనలిస్తున్న అధికారులు

లింగపాలెం, ఫిబ్రవరి 13: ధర్మాజీగూడెంలో మిర్చి రైతులకు ఉద్యాన అధికా షాఫియాఫరీహీన్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మిర్చి మొదటి దశలో కాయలపై నల్లమచ్చలు ఏర్పడతాయని, తరువాత కాయలు మొత్తం వ్యాపించి మిర్చి తాలుగా మారుతుందన్నారు. ముందుగానే జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎండుమిర్చి కోసిన వెంటనే నేలపై ఆరబెట్టరాదని, బరకాలు వేసి వాటిని ఎండబెట్టాలన్నారు. పొగమంచు కారణంగా తేమశాతం తగ్గకముందే బస్తాలో వేస్తే కాయలు రంగుమారే అవకాశం ఉందన్నారు. కాయలు కోసే సమయంలోనే మంచికాయలను, తాలు కాయలను గ్రేడింగ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

జిల్లాలో చేతి వృత్తుల శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలి

ఏలూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 13: విశ్వకర్మ యువజన పథకంలో ఆన్‌లైన్ చేయించుకున్న వారికి జిల్లాలో శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలని శ్రీ వెంకటేశ్వర అసోసియేషన్ జిల్లా నాయకులు కలెక్టర్‌కు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. జిల్లా నుంచి అధికసంఖ్యలో విశ్వకర్మ యోజనకు దరఖాస్తు చేసుకోగా శిక్షణకు భీమవరం, నరసాపురం రమ్మన్నంటున్నారని తెలిపారు. అంతదూరం వెళ్లడానికి మహిళలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఏలూరు, జంగారెడ్డిగూడెంలో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో బాలభాస్కర్‌రెడ్డి, హుస్సేన్, లక్ష్మణరావు, సత్యనారాయణరావు, సర్వేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

చిత్ర కళాకారుడు కాంతారావుకు పురస్కారం


సత్కారం అందుకున్న మజ్జి కాంతారావు

ఏలూరు కల్చరల్, ఫిబ్రవరి 13: నగరానికి చెందిన చిత్ర కళాకారుడు మజ్జి కాంతారావుకు హైదరాబాద్ క్రియేటివ్ ఆర్ట్స్, అకాడమి ఆఫ్ ఫైనార్ట్స్ విశిష్ట పురస్కారం అందజేసింది. ఈనెల 10నుంచి హైదరాబాద్‌లో చిత్రకళా వైభవం పేరుతో జరుగుతున్న కార్యక్రమంలో 50 మంది చిత్రకారులు చిత్రకళావైభవాన్ని చాటారు. ఏలూరు ఆర్ట్స్ సొసైటీ తరపున మజ్జి కాంతారావుకు మంగళవారం పురస్కారం అందజేశారు. అంజి ఆకొండి, ఎంవీ రెడ్డి, ప్రశంసాపత్రంతో కాంతారావును సత్కరించారు.

జేఈఈ మెయిన్స్‌లో వికాస్ కళాశాల విద్యార్థి ప్రతిభ


సాయిస్ఫూర్తిని అభినందిస్తున్న విష్ణు

జంగారెడ్డిగూడెం టౌన్, ఫిబ్రవరి 13: పట్టణానికి చెందిన వికాస్ జూనియర్ కళాశాల విద్యార్థి కొల్లేపర సాయిస్ఫూర్తి జేఈఈ మెయిన్స్‌లో 98.97 పర్సంటైల్ సాధించినట్లు కళాశాల డైరెక్టర్స్ కత్తుల విష్ణు, దాకారపు గణేశ్ మంగళవారం తెలిపారు. పి.హర్షిత రెడ్డి, ఎమ్.మేఘన, జి.యువ నాగ ప్రవీణ్, ఎ.శ్రీలేఖ, సీహెచ్.సంజన, ఎం.జ్ఞానేశ్వరి, ఎస్.దివ్య ఆకాష్, కె.దివ్య కుమారి, ఎస్.సాయి దీప్తి సిహెచ్. ఇసాక్ మంచి స్కోర్ సాధించి ఐఐటి, ఎన్ఐటిల్లో సీట్ సాధించే దిశగా అర్హత పొందారన్నారు. అత్యధిక స్కోరు సాధించిన కొల్లేపర సాయిస్ఫూర్తిని అభినందించారు. సాయిస్ఫూర్తి మాట్లాడుతూ తల్లితండ్రుల, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో మంచి పర్సంటైల్ సాధించినట్లు తెలిపింది.

భీమడోలు విద్యార్థి వంశీకృష్ణ ప్రతిభ


తల్లిదండ్రులతో ర్యాంకర్ వంశీకృష్ణ

భీమడోలు, ఫిబ్రవరి 13: భీమడోలు విద్యార్థి కె వంశీకృష్ణ మంగళవారం వెలువడిన జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో 99.808 పర్సంటైల్ సాధించాడు. వంశీకృష్ణ తల్లిదండ్రులు పలు ప్రభుత్వ ఉద్యోగులు. పరీక్షల్లో అత్యధిక పర్సంటేజ్ సాధించిన వంశీకృష్ణను యలమర్తి రవీంద్రకుమార్, పలువురు ప్రముఖులు, గ్రామస్తులు అభినందించారు.

విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న శారదాదేవి

పెదపాడు, ఫిబ్రవరి 13: విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని యువజన సర్వీసుల శాఖ కమిషనర్ శారదాదేవి అన్నారు. వట్లూరు సీఆర్‌రెడ్డి మహిళా కళాశాలలో వ్యక్తిత్వ వికాసంపై సెట్‌వెల్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. లక్ష్య సాధన దిశగా నిరంతరం కృషి చేయాలన్నారు. కెరీర్ కౌన్సిలర్ విజయకుమార్ మాట్లాడుతూ జీవితంలో విద్యార్థులు ప్రణాళికతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. దిశా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.విశ్వం మాట్లాడుతూ సోషల్ మీడియా వల్ల విద్యార్థుల జీవితాలు తారుమారవుతున్నాయని, వాటి జోలికి వెళ్లరాదని సూచించారు. కార్యక్రమంలో మెహరాజ్, ప్రవీణ్‌కృష్ణ, సత్యనారాయణ, కెనడీ, పసుపులేటి ప్రసాద్, శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ పెదవేగి మండల కార్యవర్గం ఎన్నిక

పెదవేగి, ఫిబ్రవరి 13: ఏపీటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులుగా ఎంవీ.కృష్ణారావు, డి.బాలాంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు తాళ్ళూరి రామారావు ఎన్నికల పరిశీలకునిగా వ్యవహరించి మండలశాఖ కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా ఎండీవీ.ప్రసాద్, కె.కిరణ్మయి, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా మేకా రంగమ్మ, కార్యవర్గ సభ్యులుగా హెచ్‌ఎం.శ్రీదేవి, ఎన్‌సీహెచ్.శ్రీదేవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని జిల్లా అధ్యక్షుడు తాళ్ళూరి రామారావు తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి బీఏ.సాల్మన్‌రాజు హాజరయ్యారు. ఎన్నికల అధికారిగా జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రెడ్డి వ్యవహరించారు.

దంత సంరక్షణతో వ్యాధులు దూరం

పెదవేగి, ఫిబ్రవరి 13: దంతాల ఆరోగ్యంగా ఉంటేనే సంపూర్ణ ఆరోగ్యమని, ప్రతిఒక్కరూ దంత సంరక్షణను పాటించాలని సెయింట్ జోసెఫ్ దంతవైద్య కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జి.మోజెస్ అన్నారు. దుగ్గిరాలలోని సెయింట్ జోసెఫ్ దంతవైద్య కళాశాలలో మంగళవారం ఓరల్ మాక్సిల్లో ఫేషియల్ సర్జన్స్ దినోత్సవం నిర్వహించారు. ఫాదర్ మోజెస్ మాట్లాడుతూ దంతాలు ఆరోగ్యంగా ఉంటేనే వ్యక్తి ఆరోగ్యం సక్రమంగా ఉంటుందన్నారు. దంత ఆరోగ్యంపైనే వ్యక్తి ఆరోగ్యం ఆధారపడి ఉంటుందనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకుని దంత సంరక్షణకు ప్రాధాన్యతనివ్వాలని ఆయన సూచించారు. దంతాలే కదా అని తేలిగ్గా తీసుకుంటే అనారోగ్యాన్ని చేజేతులు మనమే తెచ్చుకున్నట్లేనని ఆయన పేర్కొన్నారు. తొలుత దంత సంరక్షణపై గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ కె.శ్రీకాంత్, డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ గౌతమ్, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

కొవ్వలిలో ఉచిత వైద్య శిబిరం

దెందులూరు, ఫిబ్రవరి 13: కొవ్వలి మోటపర్తి భవన్‌లో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 50 మందికి గుండె వైద్య పరీక్షలను నిర్వహించి మందులు అందించారు. అనంతరం బీపీ, షుగర్ తదితర వ్యాధుల నిర్ధారణ పరీక్షలు చేసి మందులను ఉచితంగా అందించారు. మోటపర్తి భవన్ నిర్వాకులు నందిగం నారాయణరావు, వైద్యులు పాల్గొన్నారు

374 మందికి ఆరోగ్య వైద్య సేవలు

కామవరపుకోట, ఫిబ్రవరి 13 : కళ్ళచెరువు పంచాయతీలోని గండిగూడెం జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద మంగళవారం ఆరోగ్య సురక్ష-2 వైద్య శిబిరం నిర్వహించారు. 374 మందికి వైద్య పరీక్షలు చేశారు. కంటి పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. దృష్టిలోపం ఉన్న వారికి కళ్ళజోళ్ళు ఇచ్చేందుకు నమోదు చేశారు. శిబిరాన్ని గ్రామ సర్పంచ్ నౌడు శ్రీదేవి, సత్యనారాయణలు ప్రారంభించగా ఎంపీడీవో జంగం స్వర్ణభారతి, జి.మరిడయ్య, కార్యదర్శి జె.సుబ్బారావు, వీఆర్వో పి.లక్ష్మీదేవి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● టి.నరసాపురం: వెలగపాడు పంచాయతీలోని వీరభద్రవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ ఆంజనేయులు 393 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


సూరప్పగూడెంలో గన్నికి హారతి ఇస్తున్న మహిళలు


రావికంపాడులో టీడీపీ నేతల ఇంటింటి ప్రచారం



ఏలూరులో బడేటి చంటికి సన్మానం

టీడీపీ, జనసేన కూటమిని గెలిపించాలి

టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని

భీమడోలు, ఫిబ్రవరి 13: టీడీపీ, జనసేన కూటమిని గెలిపించి రాష్ట్ర అభివృద్ధి, యువత భవిష్యత్‌కు బాటలు వేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు కోరారు. భీమడోలు మండలం సూరప్పగూడెంలో మంగళవారం మన ఇంటికి మన గన్ని ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో జరిగిన రచ్చబండ కార్యక్రమంలో ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ జనసేన కూటమిని ఆశీర్వదించాలని కోరారు. గ్రామంలోని మహిళలు అడుగడుగునా గన్నికి హారతులు పట్టి నీరాజనాలు పలికారు. నియోజకవర్గంలోని మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, ముఖ్య నాయకులు, జనసైనికులు పాల్గొన్నారు.

● పోలవరం: పోలవరం ప్రత్యేక గిరిజన జిల్లా టీడీపీతోనే సాధ్యమని టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాస్ అన్నారు. పోలవరం పంచాయతీ బాపూజీ కాలనీలో బొడ్డు కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి పార్టీ మానిఫెస్టోని వివరించారు. ఒక్క చాన్స్ అంటూ గద్దెనెక్కి జగన్ రాష్ట్రాన్ని నాశనం చేశారన్నారు. ప్రతి ఒక్కరూ టీడీపీని గెలిపించాలన్నారు. కుంచే దొరబాబు, మంగిన కొండ, గుబ్బా రాంబాబు, యడ్ల వినోద్, ఆకుల రాజా, జితేంద్ర, పోతుల శ్రీను, పాదం ప్రసాద్, పిల్లి నాగరాజు, ఇళ్లా సత్యనారాయణ పాల్గొన్నారు.

● కామవరపుకోట: తెలుగుదేశం పార్టీ ప్రకటించిన సూపర్-6 పథకాలు ప్రతీ ఇంటికి ప్రయోజనం కలుగుతుందని మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు కిలారు సత్యనారాయణ, సర్పంచ్ వేముల నాగేశ్వరరావు అన్నారు. రావికంపాడులో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ సంతకాలు చేసిన బాండ్ పేపర్లను ఇంటింటికి అందజేశారు. మాన్యం దుర్గారావు, దోలా విజయ్, చలింతల రాజుల నవీన్, యర్రావుల దుర్గారావు, రామారావు, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

● ఏలూరు టూటౌన్: రాష్ట్రంలో జగన్ రెడ్డి చీకటిపాలనతో ప్రజలను అంధకారంలోకి నెట్టాడని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బడేటి చంటి అన్నారు. 37వ డివిజన్‌లో ప్రజా ఆశీర్వాద సభ నిర్వహించారు. సంక్షేమ పథకాలు అర్హులకు అందించడంలో జగన్ విఫలమయ్యాడన్నారు. మరోసారి అధికారంలోకి రావాలని కుట్రలు పన్నుతున్నాడన్నారు. టీడీపీ మేనిఫెస్టో సూపర్ 6పథకాలు ప్రజల్లో మంచి ఆదరణ ఉందన్నారు. చంటి పుట్టిన రోజును పురస్కరించుకుని ఘనంగా సన్మానించారు. నాయుడు సోము, కార్పొరేటర్ పృథ్వీ, శారద, పాలిప్రసాద్, పుప్పాల జగదీష్‌బాబు, చోడే వెంకటరత్నం, పెద్దిబోయిన శివప్రసాద్, సంధ్య నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **చింతలపూడి :** మండలంలో 2054 డ్వాక్రా సంఘాలకు 24 కోట్లు ఆసరా నిధుల చెక్కును అందజేశారు. ఏఎంసీ ఛైర్మన్ జానకీరెడ్డి, ఎంపీపీ రాంబాబు, జడ్పీటీసీ నీరజ, సునీల్‌కుమార్, కె.విజయరాజు పాల్గొన్నారు.
- **పెదపాడు :** గ్రామాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి, అర్హులకు సంక్షేమ ఫలాలను అందజేసేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి తెలిపారు. ప్రజా ఆశీర్వాద యాత్రలో భాగంగా వసంతవాడ, తోటగూడెం, పునుకొల్లు గ్రామాల్లో పాదయాత్ర చేసి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు.
- **పెదవేగి :** పెదవేగిలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని కొఠారు రామచంద్రరావు తెలిపారు. ఎంపీపీ తాతా రమ్య పాల్గొన్నారు.
- **లింగపాలెం :** మండలంలోని 1,308 మహిళా సంఘాలకు రూ.55.12కోట్లు ఆసరా నిధులు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

జాయింట్ ఎల్‌పీఎంలపై సర్వే

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ముదినేపల్లి, ఫిబ్రవరి 13 : ముదినేపల్లి మండలంలో డ్రోన్ రీ సర్వే వల్ల రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించేందుకు సర్వే శాఖ అధికారులు రంగంలోకి దిగారు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో 'డ్రోన్ రీ సర్వేతో కొత్త చిక్కులు' శీర్షికన ప్రచురితమైన కథనంతో జిల్లా సర్వే శాఖ అధికారుల ఆదేశాలతో ముదినేపల్లి మండల సర్వేయర్ రాజశేఖర్ రెడ్డి, గ్రామ సచివాలయాల సర్వేయర్లు జాయింట్ ఎల్‌పీఎంలను కొత్తగా సబ్ డివిజన్ చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. రీ సర్వే జరిగిన గ్రామాల్లో రైతుల నుంచి అందిన దరఖాస్తులను పరిష్కరించే కార్యక్రమంలో భాగంగా ఆయా చెరువులు, పొలాల్లో రైతులకు ఉమ్మడిగా ఉన్న భూములను వ్యక్తిగతంగా ఎల్‌పీఎం నంబర్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా చేపల చెరువుల్లో ఉమ్మడిగా ఉన్న భూములను తిరిగి రీ సర్వే చేసి కొత్తగా రైతులకు వ్యక్తిగతంగా ఎల్‌పీఎం నంబర్లను కేటాయిస్తున్నారు. దీంతో రైతులు తమ పాస్ పుస్తకాల్లో ఎల్‌పీఎం నంబర్లు పొందే అవకాశం ఏర్పడింది.

బంద్‌ను విజయవంతం చేయాలి



కలిదిండి, ఫిబ్రవరి 13 : కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న తలపెట్టిన భారత్ బంద్ పారిశ్రామిక సమ్మెను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు మహంకాళిరావు పిలుపునిచ్చారు. మంగళవారం కలిదిండిలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతు, వ్యవసాయ కార్మిక, కౌలు రైతు, కార్మిక ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా జరుగుతున్న గ్రామీణ భారత్ బంద్‌కు రైతులు, కార్మికులు పెద్ద సంఖ్యలో మద్దతు తెలపాలని కోరారు. సీఐటీయూ మండల అధ్యక్షులు షేక్ అబిదా బేగం, ఉపాధ్యక్షులు చిన్న శ్రీకాంత్, రైతు సంఘం నాయకులు వీరవల్లి భాస్కర్‌రావు, కుడిపూడి శ్రీనివాసరావు, జ్ఞానేషు, వెంకటేశ్వరరావు, చీకటి సత్యనారాయణ పాల్గొన్నారు.

హంసతి శ్యామలగా శ్రీశ్యామలాంబ

కైకలూరు, ఫిబ్రవరి 13: కైకలూరు శ్రీశ్యామలాంబ అమ్మవారి శ్యామలా నవరాత్రుల సందర్భంగా మంగళవారం అమ్మవారు హంసతి శ్యామలగా దర్శనమిచ్చారు. ఉదయం నుంచి అర్చకులు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించగా ఉభయ దాతల పూజల్లో చుక్కా రామకృష్ణ దంపతులు పాల్గొని పూజలు చేశారు. బుధవారం అమ్మవారు సర్వసిద్ధి మాతంగిగా దర్శనమిస్తారని ఈవో వీఎన్‌కె శేఖర్ తెలిపారు.



ప్రజా సేవకులే పాలకులు కావాలి

ముదినేపల్లి, ఫిబ్రవరి 13 : ప్రజా సేవకులే పాలకులు కావాలని, నిస్వార్థ నాయకులనే ప్రజలు ఎన్నుకోవాలని జబర్దస్త్ టీమ్ పేర్కొంది. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తపన ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గారపాటి సీతారామాంజనేయ చౌదరి ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ముదినేపల్లి మండలంలో బీజేపీ పథకాలు, ఆశయాలపై కళా ప్రదర్శనల ద్వారా ప్రచారం నిర్వహించారు. జబర్దస్త్ టీమ్ సభ్యులు అప్పారావు, అదిరే అభి, వినోదిని, ఇమ్మానియేలు, బాబీ, సినీ గాయకులు అరుణ్, లాస్య ప్రియ ముదినేపల్లి సెంటర్‌లో ప్రచారం నిర్వహించి రాబోయే ఎన్నికల్లో సీతారామాంజనేయ చౌదరిని ఏలూరు నుంచి ఎంపీగా గెలిపించాలని కోరారు. జబర్దస్త్ కళాకారుల హాస్యవల్లరి సభికులను అలరించింది. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు, ప్రోగ్రాం ఆర్గనైజర్ పంచకర్ల రఘు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కీర్తి రామ్ ప్రసాద్, పార్టీ నాయకులు సత్యవోలు నాగలక్ష్మి, వత్తుమిల్లి ప్రసాద్, మీసాల సత్యనారాయణ, సుబ్బరాజు, టీడీపీ నాయకులు జాస్తి రాజా పాల్గొన్నారు. సింగరాయిపాలెం, అల్లూరు, గురజ గ్రామాల్లోను ప్రచారం సాగింది.

సురక్ష శిబిరాల్లో వైద్య సేవలు

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 13: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నూజివీడు ఎంపీడీవో కిరణ్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. నూజివీడు మండలం హనుమంతులగూడెం సచివాలయం వద్ద నిర్వహించిన ఈ శిబిరంలో దిగవల్లి పీహెచ్‌సీ వైద్య అధికారి శ్రీను, ఇతర వైద్య సిబ్బంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. వీఆర్వో గోపి, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చాట్రాయి: సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జడ్పీటీసీ సభ్యురాలు అనూష శ్రీరామ్ కోరారు. పోలవరం వైద్య శిబిరంలో ఏలూరు జీజీహెచ్ వైద్యులు ఇ. శ్వేత, సుప్రియా చౌదరి, పీహెచ్‌సీ వైద్యులు శ్రీనివాసరెడ్డి, దుర్గాప్రసాద్, 381 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ముసునూరు: పేదల ఆరోగ్య పరిరక్షణకే సురక్ష శిబిరాలని సర్పంచ్ కంచర్ల వాణి అన్నారు. గోపవరం సచివాలయం-2 పరిధిలో ఆరోగ్య సురక్ష ఫేజ్-2 వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఏలూరు ఆశ్రం ఆసుపత్రి వైద్యులు డాక్టర్ లావణ్య, నూజివీడు అమెరికన్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ ప్రవీణ్, ముసునూరు పీహెచ్‌సీ వైద్యులు పాల్గొన్నారు.

ఆసరా చెక్కుల పంపిణీ

కైకలూరు, ఫిబ్రవరి 13: మహిళల సాధికారతకే ఆసరా పథకాన్ని ప్రవేశపెట్టామని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ జయమంగళ అన్నారు. మంగళవారం కైకలూరు జగనన్న గ్రీన్ విలేజ్‌లో నాల్గో విడత వైఎస్సార్ ఆసరా విడుదల చేశారు. ఎంపీపీ అడవి కృష్ణ, జడ్పీటీసీ కురేళ్ళ బేబి, ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర్రాజు, సర్పంచ్ డీఎం నవరత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

గోవిందరాజులుకు నివాళులు

ముదినేపల్లి, ఫిబ్రవరి 13 : గుండెపోటుకు గురై మరణించిన ముదినేపల్లి మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కరేటి గోవిందరాజులు కుటుంబాన్ని మంగళవారం ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు పరామర్శించారు. గోవిందరాజులు భౌతిక కాయాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, ముదిరాజ్ సంఘ రాష్ట్ర కార్యదర్శి కోమటి విష్ణువర్ధన్ నాయకులు సోమా సత్యనారాయణ, అచ్యుత రాంబాబు, మోత్రు ఏసుబాబు తదితరులు గోవింద రాజులు కుటుంబాన్ని పరామర్శించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 13: నూజివీడు ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు మంగళవారం మండలంలోని సీతారాంపురం, ఈదర, బొద్దనపల్లి, పిన్నమరెడ్డి పల్లి, ఎస్‌ఏ పేట, పోతవరప్పాడు గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రైన్‌లకు శంకుస్థాప నలు చేశారు. నెక్కలం గొల్లగూడెం, అడవినెక్కలం గ్రామాల్లో సచివాలయాలు, ఆర్బీకేలు ప్రారంభించారు.

క్రైం కార్నర్

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ముసునూరు, ఫిబ్రవరి 13: మండల పరిధిలోని బలివే తమ్మిలేరు నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. బలివే గ్రామానికి చెందిన కాట్రు చిన్న రామలింగం, కాట్రు పెదరామలింగం తమ ట్రాక్టర్లతో అనుమతులు లేకుండా తమ్మిలేరులో ఇసుకను తీసుకువెళ్తుండగా ఎస్‌ఐ వాసు తన సిబ్బందితో దాడి చేసి ట్రాక్టర్లను ముసునూరు తహసీల్దార్ జవహర్ బాజీకి రిఫర్ చేశారు. ఒక్కొక్క ట్రాక్టర్‌కు రూ. 5 వేలు చొప్పున జరిమానా విధించినట్టు తహసీల్దార్ తెలిపారు.

తెలంగాణ మద్యం స్వాధీనం

నూజివీడు, ఫిబ్రవరి 13: నూజివీడు సెబ్ పరిధిలో నిర్వహించిన దాడుల్లో ఒకర్ని అదుపులోకి తీసుకుని తెలంగాణ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు నూజివీడు సెబ్ సీఐ వెంకటరమణ తెలిపారు. నూజివీడు సెబ్ స్టేషన్ పరిధిలోని చాట్రాయి మండలం కృష్ణారావుపాలెంలో నిర్వహించిన దాడుల్లో ఏ.కొండూరు మండలం చీమలపాడుకు చెందిన బూక్యా పండుబాబును అదుపులోకి తీసుకుని అతని నుంచి 27 తెలంగాణ మద్యం సీసాలను స్వాధీన పరుచుకున్నట్టు ఆయన తెలిపారు.

సమరానికి సిద్ధం

'నాలుగున్నరేళ్ల పాలనలో వైసీపీ ప్రభుత్వం ఉద్యోగులకు చేసిందేదీ లేదు. తొలుత మధ్యంతర భృతిని 27శాతం ఇచ్చి ఫిట్‌మెంట్‌కు వచ్చేసరికి దానిని 23 శాతానికి తగ్గించడం చరిత్రలో ఎక్కడాలేదు. ఇక సీపీఎస్ రద్దు విషయంలోనూ మాట తప్పారు. ఉద్యోగుల కనీస డిమాండ్ల పరిష్కారానికి కొవిడ్ తదితర సాకులను చెబుతూ కాలయాపన చేస్తున్న ప్రభుత్వానికి ఇప్పటికే ఎన్నో అవకాశాలిచ్చాం. చివరకు మేం దాచుకున్న డబ్బులనుకూడా ఇవ్వాల్సిందిగా ఏళ్ళ తరబడి అడుగుతున్నా జాప్యం చేస్తున్నందునే ఉద్యమ శంఖారావానికి సిద్ధమయ్యాం. మాకు ఇవ్వాల్సిన ఆర్థిక బకాయిల చెల్లింపుపై ఇక ముఖ్యమంత్రితోనే చర్చలుగానీ, పరిష్కారాలుగానీ ఉంటాయి. మంత్రుల కమిటీల మాటలగారడీలకు తలొగ్గం' అంటూ పోరుబాటకు సిద్ధమయ్యారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఏపీఎన్జీవో నేత శ్రీనివాస్, తదితరులు

దగా ప్రభుత్వంపై ఉద్యోగుల పోరుబాట

నేటినుంచి దశలవారీ ఉద్యమ కార్యాచరణ

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 13 :

ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం బకాయిపడిన రూ.23,250 కోట్లను చెల్లించాలంటూ ఏపీ జేఏసీ బుధవారం నుంచి నిర్వహించ తలపెట్టిన దశలవారీ ఉద్యమ కార్యాచరణను మంగళవారం ఏలూరులో ఐక్య కార్యాచరణ సమితి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా చైర్మన్ సీహెచ్‌.శ్రీనివాస్, కన్వీనర్ ఎన్.వి.రామారావు తదితరులు విలేకరుల సమావేశంలో ప్రకటించారు. ఆర్థిక బకాయిలపై మంత్రులు, ఆర్థికశాఖ ఉన్నతాధికారుల సమక్షంలో జేఏసీ నాయకులతో జరిగిన చర్చల్లో ఎటువంటి ఫలితంలేనందున తొలుత ప్రకటించినట్టుగానే బుధవారం నుంచి ఉద్యమాన్ని యథాతథంగా నిర్వహిస్తున్నామన్నారు. 12వ పీఆర్సీ అమలుకు ముందుగా మధ్యంతర భృతి ఇవ్వాలని అభ్యర్థించినప్పటికీ మంత్రుల కమిటీ సానుకూలంగా స్పందించలేదని వివరించారు. మొత్తం బకాయిల్లో రూ.5,500 కోట్లను వచ్చేనెలలోగా సర్దుబాటు చేయడానికి ప్రభుత్వం ముందుకువచ్చిందని, ఈ చెల్లింపునకు రూట్‌మ్యాప్ ఇవ్వాలని జేఏసీ ప్రతిపాదించగా నిరాకరించడమే ప్రభుత్వ హామీపై అపనమ్మకానికి నిదర్శనమన్నారు. ఇంటీరియం రిలీఫ్‌పై మంత్రుల కమిటీ దాటవేత వైఖరిని జేఏసీ సభ్యసంఘాలు ఆక్షేపిస్తున్నా యన్నారు. కొవిడ్‌తో మృతిచెందిన ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకాలు ఇంతవరకు కార్యరూపం దాల్చలేదని చర్చల్లో ప్రశ్నించినా ప్రభుత్వంనుంచి స్పందనలేదన్నారు. వీటితోపాటు సరెండర్ లీవులు, జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ రుణాలు, డీఏ బకాయిలు, 11వ పీఆర్సీ బకాయిలు, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, మెడికల్ బిల్లుల చెల్లింపులువంటి డిమాండ్లను ప్రభుత్వం ముందుంచామని, వీటిలో ఏ ఒక్కటీ పూర్తిస్థాయిలో పరిష్కారమవుతాయన్న నమ్మకం కలగకపోవడంవల్లే ఉద్యమ కార్యాచరణను చేపట్టాలని తీర్మానిం చారని వివరించారు. ఇక మీదట మంత్రుల కమిటీలతో చర్చలు జరిపే ప్రసక్తేలేదని, నేరుగా ముఖ్యమంత్రే జోక్యం చేసుకుని ఆయన సమక్షంలో మాత్రమే చర్చలు జరిపితే జేఏసీ నాయకులు వెళతారని స్పష్టం చేశారు.

నేటి నుంచి ఉద్యమ తీరు ఇలా..

డిమాండ్ల సాధన కోసం చేపట్టిన ఉద్యమ శంఖారావంలో భాగంగా బుధవారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ నల్లబ్యాడ్జీలను ధరించి విధులకు హాజరవుతారని తహసీల్దార్/ సబ్‌కలెక్టర్/ కలెక్టర్‌లకు వినతిపత్రాలు అందజేస్తారని వివరించారు. 15, 16 తేదీల్లో మధ్యాహ్న భోజన విరామ సమయంలో తాలూకా/పాఠశాలల్లో నిరసనలు, 17న తాలూకా కేంద్రాల్లో ర్యాలీ-ధర్నా, 20న జిల్లా కలెక్టరేట్లవద్ద ర్యాలీ, ధర్నా, 21 నుంచి 24 వరకు జిల్లావ్యాప్తంగా జేఏసీ నాయకుల పర్యటన, 27న చలో విజయవాడ ఆందోళనలను చేపట్టడానికి తీర్మానించినట్టు ఏపీ ఎన్జీవో నాయకుడు శ్రీనివాస్ వివరించారు.

మిగతా డిమాండ్లు ఇవే..

2004 సెప్టెంబరు ఒకటో తేదీకి ముందు నోటిఫై అయిన అనంతరం నియామకాలు జరిగిన ఉపాధ్యాయులు, ఉద్యోగులకు పాతపెన్షన్ స్కీం (ఓపీఎస్)ను అమలు చేయాల్సిందేనని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. పెన్షనర్లలో 70-75ఏళ్ళ వయస్సున్న వారికి అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ మంజూరు చేయాలని, అన్ని నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఈహెచ్‌ఎస్ కార్డులపై నగదు రహిత వైద్యం, ఉద్యోగులందరికీ ఇంటి స్థలాలు, టీచర్లకు అప్రెంటీస్ విధానాన్ని రద్దుచేయాలి. ప్రభుత్వ, పంచాయతీరాజ్ టీచర్లకు ఉమ్మడి సర్వీసు రూల్స్ అమలు, ప్రతీ నెలా ఒకటో తేదీనే జీతభత్యాలు చెల్లించాలని, ఉద్యోగ విరమణ చేసిన వారికి బెనిఫిట్స్‌ను అందించాలి. సమావేశంలో జేఏసీ ఉమ్మడి జిల్లా నా యకులు రవికుమార్, నరసింహారావు, ఆంజనేయులు, సత్యనారాయణ, శ్రీధర్ రాజు, గంగాధర్, బేగ్, మల్లిక, సునీత, రమణ, స్వామి, సత్యభారతి, శ్రీనివాస్, హరినారాయణ, సీఐటీయూ కార్యదర్శి ప్రసాద్, సీపీఐ నాయకులు వెంకటేశ్వర రావు, అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు పాల్గొన్నారు.



దుర్మార్గ పాలనను అంతం చేయాలి : కామినేని

కలిదిండి, ఫిబ్రవరి 13 : వైసీపీ దుర్మార్గ పాలన ను అంత మొందించాలని మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ పిలుపుని చ్చారు. మంగళవారం పడమటిపాలెం, గుర్వాయిపాలెం గ్రామాల్లో ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని, రైతుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని, ధాన్యం అమ్మిన నగదు సక్రమంగా చెల్లించక పోవ టంతో అప్పుల పాలై పలువురు రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారన్నారు. తాగు నీటి చెరువులు అడుగంటుతున్నా తాగునీటి వంతు కూడా ఇవ్వలేక పోవటం దారుణమన్నారు. పోలవరం ప్రాజెక్టు గాలికి వదిలేయటంతో సాగునీటి సమస్య ఏర్పడిందన్నారు. సమస్యలపై ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయించి వేధించటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగి రాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, మాజీ జడ్పీటీసీ నున్న రమాదేవి, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అంద్రాజు శ్రీనివాస్, నాయకులు లంకా రత్నారావు, తేరా రమేష్, సుధాబత్తుల రాధాకుమారి, గంగుల వెంకటేశ్వరరావు, జనసేన నాయకులు నల్లగోపుల చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.



ముదినేపల్లిలో 'నా తొలి ఓటు చంద్రబాబుకే'

ముదినేపల్లి, ఫిబ్రవరి 13 : తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మంగళ వారం ముదినేపల్లిలో నా తొలి ఓటు చంద్రబాబుకే కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ కైకలూరు నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కొడాలి వినోద్ ఆధ్వర్యంలో కొత్తగా ఓటు హక్కు పొందిన యువతీ, యువకులతోపాటు విద్యార్థులతో ఈ కార్యక్రమంపై ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా కొడాలి వినోద్ మాట్లాడుతూ గత ఐదేళ్లలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ప్రభుత్వపరంగా ఎటువంటి ప్రయత్నాలు జరగలేదని, కొత్తగా ఓటు పొందిన యువత రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన కూటమికి అధికారం ఇచ్చేలా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. రాష్ట్ర భవిష్యత్‌ను కోరుకునే యువతీ, యువకులు తమ తొలి ఓటును మంచి పాలన అందించగల సమర్థుడైన నాయకుడిని ఎన్నుకునేందుకు సద్వినియోగం చేయాలని వినోద్ కోరారు. తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు దావు నాగరాజు, పార్టీ నాయకులు గంగుల శ్రీదేవి, నున్న సుబ్రహ్మణ్యం, శరత్, కొత్తూరు విఠల్, బొర్రా చలమయ్య, చలసాని జగన్మోహనరావు, పరసా విశ్వేశ్వరరావు, పరసా ఏడుకొండలు, దారం సుధ పాల్గొన్నారు. పాల్గొన్నారు.

ఉపాధి కూలీ రూ. 600 ఇవ్వాలి

చాట్రాయి, ఫిబ్వరి 13: ఉపాధి కూలీలకు ఏడాదికి 200 రోజులు పనులు కల్పించి రూ. 600 వేతనంతో పాటు పేస్లిప్పులు ఇవ్వాలని వామపక్ష నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చాట్రాయిలో మంగళవారం జరిగిన సమావేశంలో వామపక్ష నాయకులు మాట్లాడుతూ స్వామినాథన్ కమిటీ సిఫారసులు అమలు చేసి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, మిచౌంగ్ తుపాన్‌లో నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన కార్మిక చట్టాలను అమలు చేయాలని తదితర డిమాండ్లతో 16వ తేదీన జరిగే దేశవ్యాప్త బంద్‌లో అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం, సీపీఐ (ఎంఎల్) జిల్లా కార్యదర్శి దుర్గం పుల్లా రావు, రైతు సంఘం మండల కార్యదర్శి రాజారావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి వంతుపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తా



కలిదిండి, ఫిబ్రవరి 13 : వెంకటాపురం తాగునీటి చెరువు అడుగంటడంతో తాగునీటి వంతు కోసం సర్పంచ్, గ్రామస్థులు ఎదురు చూస్తున్నారు. తాగునీటి చెరువు వద్ద విద్యుత్ మోటారు పంపు సెట్లను ఏర్పాటు చేసుకు న్నారు. తాగునీరు ఇస్తున్నామని ఇరిగేషన్ అధికారులు చెప్పటంతో చెరువులను నింప టానికి సన్నాహాలు చేశామని ఇంత వరకు చెరువు వద్ద నీటి వంతు రాలేదని సర్పంచ్ గూడవల్లి శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోరుకొల్లు లాకుల వద్ద వదిలిన నీరు పోతుమర్రు కాల్వలో అడుగు లోతులో మాత్రమే ఉన్నాయని, వాటిని మినుము పైరుకు రైతులు తోడుకుంటున్నా రన్నారు. తాగునీటి వంతు ఇచ్చే పరిస్థితి కనిపించ కపోవటంతో గ్రామస్థులతో కలసి కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని అప్పటికీ స్పం దించకుంటే ఆమరణ దీక్ష చేపడతానని సర్పంచ్ తెలిపారు.

గజవాహనంపై శోభనాచలుడు



ఆగిరిపల్లి, ఫిబ్రవరి 13: రథసప్తమిని పురస్కరించుకుని మంగళవారం ఉదయం పెద్దకొరాయిలో శ్రీ శోభనాచల వ్యాఘ్రలక్ష్మీ నరసింహస్వామికి ఆగిరిపల్లి రజక సంఘం ఆధ్వర్యంలో శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం గజవాహనంపై ఉత్సవ మూర్తులకు ఆగిరిపల్లి మాడ వీధుల్లో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌లలో ఏర్పాట్లు చేయాలి : తహసీల్దార్

ముదినేపల్లి, ఫిబ్రవరి 13 : రానున్న ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ముదినేపల్లి మండలంలో 61 పోలింగ్ బూత్‌ల వద్ద పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమష్టిగా కృషి చేయాలని తహసీల్దార్ ఎస్‌ఎల్‌ఎన్ కుమారి తెలిపారు. మంగళవారం మండలంలోని కొర్రగుంటపాలెం, విశ్వనాద్రిపాలెం, ఈడేపల్లి గ్రామాల్లో పోలింగ్ బూత్‌లను ఎంపీడీవో గంగాధరరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, పోలీసు సిబ్బందితో కలసి ఆమె పరిశీలించారు. ఓటర్లకు, పోలీసు సిబ్బందికి పోలింగ్ బూత్‌ల వద్ద అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసేందుకు ఇప్పటి నుంచే కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని అధికారులకు సూచించారు.



'వారధి'కి పునాది వేసింది టీడీపీనే : కమ్మిలి

కైకలూరు, ఫిబ్రవరి 13: కొల్లేటికోట పెద్దింటి అమ్మవారి వారధి నిర్మాణానికి పునాదులు వేసింది టీడీపీ ప్రభుత్వమేనని మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు అన్నారు. మంగళవారం కైకలూరు టీడీపీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ కొల్లేటికోట పెద్దింటి అమ్మవారి వారధి ప్రారంభోత్సవంలో వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలు చేయడంపై టీడీపీ నేతలు మండిపడ్డారు. 2017లో కొల్లేటికోట సర్కారు కాలువపై పెద్దింటి అమ్మవారి వారధికి శంకుస్థాపన చేసింది అప్పటి మంత్రులు అయ్యన్న పాత్రుడు, కామినేని శ్రీనివాస్, ఎంపీ మాగంటి బాబు అని, నిర్మాణానికి అనుమతులు మంజూరు కాక వాయిదా వేశారన్నారు. వారధి నిర్మాణానికి కేంద్రం అనుమతులు కావాల్సి ఉండడంతో అప్పటి మంత్రి కామినేని, ఎంపీ మాగంటి బాబు ఢిల్లీ చుట్టూ తిరిగి అప్పటి ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు ద్వారా అనుమతులు తీసుకువచ్చిన ఘనత టీడీపీదే అన్నారు. అంతేగాక రూ.14 కోట్ల నిధులను టీడీపీ ప్రభుత్వమే మంజూరు చేసిన సంగతిని గుర్తు చేశారు. ఇటీవల కొల్లేరు వారధిని నిర్మాణం చేసింది తామేనంటూ మంత్రి కారుమూరి అనడం హాస్యాస్పదమన్నారు. జగన్మోహన్ రెడ్డి కొల్లేరుపై రెగ్యులేటర్ నిర్మిస్తానన్నారని, అది ఎక్కడ నిర్మిస్తున్నారో ఎవరికీ తెలియదన్నారు. టీడీపీ నాయకులు పెన్మెత్స వెంకటేశ్వరరాజు, పార్టీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు కేకే బాబు, పట్టణ పార్టీ అధ్యక్షుడు ఎండీ జాని, ఎస్సీ సెల్ నాయకుడు వాసిపల్లి సతీష్ కన్నా తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ చెప్పేదొకటి.. చేసేదొకటి

ఎస్టీయు జిల్లా అధ్యక్షుడు శ్యామ్యూల్



చాట్రాయి, ఫిబ్రవరి 13: ఉద్యోగ ఉపాధ్యాయుల విషయంలో సీఎం జగన్ చెప్పేదొకటి చేసేదొకటి అని ఎస్టీయు జిల్లా అధ్యక్షుడు శ్యామ్యూల్ అన్నారు. చాట్రాయిలో మంగళవారం ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు ప్రభుత్వం రూ. 21 వేల కోట్లు బాకీ ఉన్నదని వాటి విడుదలకు మార్చి 31 గడువు పెట్టారని అప్పటికి ఎన్నికల కోడ్ వస్తుందని ప్రభుత్వం తీరు అంతా బకాయిలు ఇవ్వకుండా కాలయాపన చేయటమే అన్నారు. సీపీఎస్‌ను రద్దు చేస్తానని ఎన్నికల్లో హామీ ఇచ్చి మోసం చేశారని, ఓపీఎస్ అమలు కు ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఐక్యంగా పోరాడాలన్నారు. పాఠశాలల విలీనం పేరుతో రాష్ట్రంలో 118 స్కూల్స్ మూసివేశారని 4500 ఎస్‌జీటీ, క్రాఫ్ట్, డ్రాయింగ్ పోస్టులు రద్దు చేసి ఇప్పుడు వందల పోస్టులే భర్తీ చేస్తున్నారని, ఈ విధంగా వైసీపీ ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేయటం దారుణమన్నారు. మండలంలోని పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇది దగా డీఎస్సీ



మాట్లాడుతున్న గోళ్ళ పవన్

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 13: కాంగ్రెస్ హయాంలో డీఎస్సీ ద్వారా 52 వేల పోస్టులను తీస్తే జగన్ డీఎస్సీలో 6 వేల పోస్టులతో దగా డీఎస్సీని విడుదల చేశారని యువజన కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ గోళ్ళ పవన్ కుమార్ ఎద్దేవా చేశారు. నూజివీడులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2019లో పాదయాత్ర సందర్భంగా 25 వేల టీచర్ పోస్టులు భర్తీ చేస్తానన్న జగన్‌రెడ్డి ఐదేళ్ల పాటు ఎటువంటి నోటిఫికేషన్‌లు ఇవ్వకుండా కాలయాపన చేసి ఎన్నికల ముందు 6 వేల పోస్టుల భర్తీకి చర్యలు ఎన్నికల జిమ్మిక్కేనన్నారు. టెట్, డీఎస్సీలకు కలిపి నోటిఫికేషన్ ఇస్తే అభ్యర్థులు దేనికి సిద్ధం కావాలని ఆయన ప్రశ్నించారు. నోటిఫికేషన్ ఇచ్చిన 30 రోజుల్లో పరీక్షలు పెట్టడం దేశంలో ఎక్కడా లేదన్నారు.

మారుతున్న పరిస్థితులను అధ్యయనం చేయాలి



సెమినార్‌లో మాట్లాడుతున్న తపనా చౌదరి

నూజివీడు, ఫిబ్రవరి 13: ఆధునిక యుగంలో ప్రపంచ స్వరూప స్వభావాలు అనునిత్యం మారుతున్నాయని వాటిని యువత అర్థం చేసుకుంటూ ముందుకు సాగడం వల్ల జాతి అభివృద్ధి సాధ్యమని తపనా ఫౌండేషన్ చైర్మన్, ఏలూరు పార్లమెంట్ బీజేపీ ఇన్‌చార్జ్ గారపాటి సీతారామాంజనేయ చౌదరి అన్నారు. నూజివీడు సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో దేశాభివృద్ధిలో యువత పాత్ర అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ యువత ఎదురయ్యే పరిస్థితులను నిరంతరం అధ్యయనం చేయాలన్నారు. మరో ముఖ్యఅతిథి, ఏపీ అకాడమి ఆఫ్ సైన్సెస్ గౌరవ కార్యదర్శి కృష్ణా వర్సిటీ పీజీ క్యాంపస్ ప్రిన్సిపాల్ ఎంవీ బసవేశ్వరరావు మాట్లాడుతూ యువత వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుని భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలన్నారు. సిద్ధార్థ విద్యా సంస్థల చైర్మన్ మేడా మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



ఎస్టీయూ డైరీ ఆవిష్కరణ

చాట్రాయి, ఫిబ్రవరి 13: దేశానికి రాజైనా గురువు కన్పిస్తే హోదాను పక్కన పెట్టి నమస్కరించటం మన సంప్రదాయమని, అంతటి విలువన్న స్థానాన్ని నేటి ఉపాధ్యాయులు కాపాడుకోవాలని రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి కోరారు. ఎస్టీయు 2024 డైరీని మంగళవారం స్థానిక మెయిన్ స్కూల్‌లో దేశిరెడ్డి ఆవిష్కరించారు. ఎంఈవో బ్రహ్మచారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఎక్కువ శాతం మంది పేద పిల్లలు చదువుతున్నారని వారిని ఉన్నత విద్యావంతులుగా తయారు చేసి బంగారు భవిష్యత్తు అందించాలని సూచించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు చెలికాని బాబ్జీ, మాజీ సర్పంచ్ కారంగుల శ్రీనివాసరావు, జీవీఆర్ ట్రస్ట్ అధినేత గుత్తా వెంకటేశ్వరరావు, ఎస్టీయు జిల్లా అధ్యక్షుడు శ్యామ్యూల్, వ్యాపార ప్రముఖుడు వీసం బుల్లిబాబు మండలంలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కైకలూరు టౌన్ ఎస్సైగా ఎంఆర్‌కే రాజు



కైకలూరు, ఫిబ్రవరి 13: కైకలూరు టౌన్ ఎస్సైగా ఎంఆర్‌కె రాజు బాధ్యతలు చేపట్టారు. ఈయన భీమవరం సీసీఎస్ నుంచి బదిలీపై కైకలూరు ఎస్సైగా వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎస్సైగా పనిచేసిన ప్రతాప్‌రెడ్డి వీఆర్‌కు బదిలీ అయ్యారు.

ముసునూరు తహసీల్దార్‌గా జవహర్ బాజి



ముసునూరు, ఫిబ్రవరి 13: ముసునూరు తహసీల్దార్‌గా జవహర్ బాజి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న దాసరి సుధ రాజమహేంద్రవరం తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. కొవ్వూరు సబ్ కలెక్టర్ కార్యాలయ ఏవోగా పనిచేస్తున్న బాజిని ముసునూరు తహసీల్దార్‌గా అధికారులు నియమించారు.

బాలుడి చికిత్సకు ఎస్ఐ వాసు చేయూత



ముసునూరు, ఫిబ్రవరి 13: బాలుడి చికిత్స నిమిత్తం ఆర్థిక సాయం చేసి ముసునూరు ఎస్ఐ పి.వాసు తన మానవత్వాన్ని చాటుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా నామవరం గ్రామానికి చెందిన భార్గవ్ అనే మూడేళ్ళ బాలుడి కిడ్నీ చికిత్సకు ఆర్థిక సాయం చేయాలని సోషల్ మీడియాలో బాలుడి తల్లిదండ్రుల అభ్యర్థనకు స్పందించిన ఎస్ఐ వాసు మంగళవారం గుంటూరు ప్రైవేటు ఆసుపత్రికి వెళ్ళి రూ. 80 వేలు బాలుడి తల్లికి అందజేశారు. ఆయనను పలువురు అభినందించారు.

నేడు సామూహిక అక్షరాభ్యాసం

నూజివీడు, ఫిబ్రవరి 13: వసంత పంచమి సందర్భంగా నూజివీడులోని సరస్వతీ ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. తెల్లవారు జామున 3.30 గంటలకు అమ్మవారికి అభిషేకం అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఉదయం 7.30 నుంచి వేదపండితుల ఆధ్వర్యంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం జరుగుతుంది. మధ్యాహ్నం 11 గంటల నుంచి అన్నప్రసాద వితరణ జరుగుతుంది. ఉదయం గణపతి హోమం, సరస్వతి హోమాలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

సంగీత, నృత్య కళల్లో రాణించాలి



నూజివీడు టౌన్, ఫిబ్రవరి 13: విద్యార్థుల్లో సంగీత, నృత్య కళల్లో మక్కువ పెంచేలా నూజివీడు ట్రిపుల్ ఐటీ టీం స్టూడెంట్ మిత్రా సంస్థ పేరుకు తగ్గట్టుగా వ్యవహరిస్తోందని, ఫ్యాకల్టీ కన్వీనర్ డాక్టర్ డీవీ నాగార్జునాదేవి అన్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో సోమవారం రాత్రి సితార 2కె-24 పేరుతో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు పాటలు, నృత్య ప్రదర్శన, మిమిక్రీతో ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నారు. స్టూడెంట్ మిత్ర అధ్యక్షులు చిల్లపల్లి పవన్, అధ్యాపక బృందం సుబ్బలక్ష్మి, డాక్టర్ అప్పారావు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రం పరిశీలన

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 13: ఏపీపీఎస్సీ గ్రూప్-2 ప్రిలిమ్స్ ఎగ్జామినేషన్ సెంటర్‌ను నూజివీడు ఎంపీడీవో కిరణ్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. నూజివీడు పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో నిర్వహించ తలపెట్టిన గ్రూప్-2 పరీక్షా కేంద్రాన్ని, వసతులను ఆయన పరిశీలించారు.

వాహనాలు తనిఖీ చేసిన సీఐ సురేష్‌బాబు

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 13: నూజివీడు మండలం తుక్కులూరులో నూజివీడు రూరల్ సీఐ బాల సురేష్‌బాబు సిబ్బందితో కలసి వాహనాల తనిఖీ చేపట్టారు. నిబంధనలు అతిక్రమించి వెళుతున్న వాహనదారులకు, హెల్మెట్లు ధరించని వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రమాదాలు జరిగినప్పుడు హెల్మెట్‌తో ప్రాణాపాయం తప్పుతుందన్నారు. నూజివీడు రూరల్ ఎస్సై మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భద్రతా నియమాలు పాటించండి : ఎంవీఐ

నూజివీడు, ఫిబ్రవరి 13: రహదారి భద్రతా నియమాలు పాటించటం వల్ల వాహనచోదకులు సురక్షితంగా ఇంటికి చేరడంతో పాటు ప్రయాణికుల ప్రాణాలు సైతం కాపాడిన వారవుతారని నూజివీడు ఎంవీఐ నాగమురళి అన్నారు. జాతీయ రోడ్డుభద్రతా మాసోత్సవాల సందర్భంగా మంగళవారం నూజివీడులో క్యాబ్ డ్రైవర్లతో రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్, లైట్ వెహికల్ వాహనదారులు సీటుబెల్టును తప్పనిసరిగా ధరించాలన్నారు. సామర్థ్యాన్ని మించి వాహనాల్లో ప్రయాణికులను తరలిస్తే వారి పై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వాణిజ్య విభాగం కార్యదర్శిగా రాము

ముదినేపల్లి రూరల్, ఫిబ్రవరి 13: గురజ గ్రామానికి చెందిన అడుసుమిల్లి రాముని టీడీపీ జిల్లా వాణిజ్య విభాగం కార్యదర్శిగా నియమిస్తూ పార్టీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు కోటా కోటిలింగం బాబు మంగళవారం నియామక పత్రం అందజేశారు. రాముని రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షుడు జగన్మోహన్‌రావు, వీరాబత్తిన సుధా అభినందించారు.